


ప్రగతినగర్‌లో...

- ప్రజల ప్రాణాలతో అధికారుల చెలగాటం
- ఎక్కడ కక్కడ లీకులతో తాగునీరు కలుషితం
- ప్రజలు అస్వస్తతకు గురవుతున్నా పట్టని అధికారులు
- నగరపాలక సంస్థ నిర్లక్ష్యానికి ఇద్దరు మృతి
- ఇంజనీర్ల బాధ్యతారాహిత్యానికి ఇంకెంతమంది బలికావాలో?


కాకుమాను వారి తోటలో....

మురుగులో.. తాగునీటి పైపులు


తురకపాలెం రోడ్డులో.. ఇలా

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 11: నగరంలో ఎక్కడ చూసినా మురుగు కాల్వల్లోనే తాగునీటి పైపులు. అనేక చోట్ల పైపులైన్లకు లీకులు. రోడ్లు, డ్రెయిన్లు తవ్వేసినప్పుడల్లా తాగునీటి పైపులు ధ్వంసం. లీకుల పైపులకు తూతూమంత్రంగా మరమ్మతులు. దీంతో కాల్వల్లోని మురుగునీరు పైపుల్లోకి చేరడం ఆ నీరు కుళాయిల ద్వారా ప్రజలకు అందడం.. దానినే తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించడం.. ఆ తర్వాత ఆ ప్రాంతంలోని వారంతా అస్వస్తతకు గురికావడం సర్వసాధారణంగా ఉంటోంది. లీకైన పైప్‌లైన్లలో మురుగునీరు (కంటమినేషన్ వాటర్) సరఫరా అవుతుంది. ఇంజనీరింగ్ ఫిర్యాదు చేసినా కూడా అధికారులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరని ప్రజలు మండిపడుతున్నారు. గతంలో అనేక పర్యాయాలు కుళాయిల్లో మురుగునీరు సరఫరా అవుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వాటిపై స్పందించలేక పోవడంతోనే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తుంది. బీఆర్ స్టేడియం, వసంతరాయపురం మెయిన్‌రోడ్డు, శారదాకాలనీ మెయిన్‌రోడ్డు, కాకానిరోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, గౌతమినగర్, చైతన్యపురికాలనీ, పాత గుంటూరు, బాలాజీనగర్, కొరిటెపాడులోని పీర్ తోట, నగరాలు, మంగళదాస్‌నగర్, ఏటీఅగ్రహారం, టెలికం నగర్ తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్లలో లీకులు ఏర్పడి తాగునీరు కలుషితం అవుతుండటం పరిపాటి గా ఉంటోంది. పైప్‌లైన్లకు తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టడంతో కుళాయిల్లో మురుగునీరు సరఫరా అవుతుంది. నగరానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్లు కూడా మురుగు నీటిలోనే ఉన్నాయి. తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి పందులకాలనీ గుండా ఏర్పాటు చేసిన పైపులైన్లు సుమారు కిలోమీటర్ మేరకు మురుగునీటిలో ఉన్నాయి. వీటితోపాటు నగరంలోని ఆనందపేట, సంగడి గుంట, పట్టాభిపురం, శారదాకాలనీ, మద్దిరాల కాలనీ తది తర ప్రాంతాల్లో మురుగునీరు కాల్వల్లోనే పైపులైన్లు ఉన్నాయి. విపత్కర పరిస్థితుల్లో కూడా ఇంజనీరింగ్ అధికారులు కంటితుడుపు చర్యలకే పరిమితమవు తున్నారు. మురుగునీటిలో తాగునీటి పైప్‌లైన్ ఉంటే ఎప్పటికైనా ప్రమాదమేనన్న విషయాన్ని గుర్తించ కుండా ఇంజనీరింగ్ అధికారులు పట్టీ పట్టనట్లుగా ఉన్నారు. ఇటీవల బీఆర్ స్టేడియం పైపులైన్ల రిపేర్ల కోసం రెండుసార్లు తాగునీటి సరఫరాని నిలిపేశారు. లీకుల రిపేర్ల సమయంలో మురుగునీరు పైపులైన్లలోకి చేరింది. నెహ్రూనగర్ నుంచి ఇతర ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే పైపులైన్లను కూడా మార్చారు. ఆ సమయంలో వాటిల్లోకి కూడా బురద, మురుగునీరు చేరింది. నేటికీ పైపులైన్ల లీకులు ఏ వీధికి వెళ్లినా కనిపిస్తున్నాయి. ప్రజల ఇళ్లల్లోకి ఏర్పాటు చేసే కుళాయి కనెక్షన్ పైపులైన్లని మురుగు కాల్వల్లోనే ఉంటాయి. వాటికి తుప్పు పట్టి ఎక్కడ చిన్న చిల్లు పడినా అందులోకి మురుగునీరు చేరుతుంది. ఏదైనా రిపేరుకి ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిస్తే గుంత తవ్వడం కోసమే రూ.3,500 వసూలు చేస్తున్నారు. ఇక కొత్త పైపులు, ఇతర మెటీరియల్ అంటూ దాదాపుగా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు కూడా వసూలు చేస్తున్నారు. అదేమంటే గ్యాంగ్ వర్కర్లకు కార్పొరేషన్ జీతాలు చెల్లించదని, ఇలా ప్రజలు ఇచ్చే వాటితోనే వాళ్లు జీవిస్తుంటారని అధికారులు చెబుతుంటారు.

డయేరియా కాదట

మంత్రి వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): నగరంలో కలుషిత నీటి కారణంగా ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురౌతుంటే ఆ లక్షణాలు డయేరియావి కావని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ప్రతిపక్షాలతో పాటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటిసరఫరాపై ఆదివారం కలెక్టరేట్‌లో మంత్రి సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎదురుదాడికి దిగారు. ఇప్పటికే ఇద్దరు చనిపోగా దాదాపుగా 40 మంది అనారోగ్యానికి గురై జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నా 2018లో(ఐదేళ్ల క్రితం) జరిగిన ఉదంతంపై మాట్లాడారు. అప్పట్లో కలుషిత నీరు తాగి ఆనందపేటలో పలువురు చనిపోయిన విషయం ఈ రాష్ట్రం మొత్తానికి తెలుసని, అప్పటి టీడీపీ ప్రభుత్వం దానిని దాచి పెట్టినట్లుగా మంత్రి రజని ఇప్పుడు ప్రస్తావించడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో గత కొన్ని రోజుల నుంచి కలుషిత నీటి సరఫరా చాలా ప్రాంతాల్లో జరుగుతున్న విషయం అందరికి తెలిసిందే. పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటిలో బురద శాతం ఎక్కువగా ఉందని నగరపాలకసంస్థ కమిషనరే రెండు వారాల క్రితం ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఫిల్టరేషన్ ప్లాంట్ల వద్ద మరింత శ్రద్ధ తీసుకుని క్లోరినేషన్ విషయంలో ఇంజనీర్లు జాగ్రత్తగా ఉండి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు.

వణికిస్తున్న కేసులు

డయేరియా కేసులు నగరవాసులను వణికిస్తున్నాయి. గతంలో నగరంలో పెద్దసంఖ్యలో మృతి చెందారు. ఈ రెండు రోజుల్లో ఇద్దరు చనిపోగా.. 30 మందికి పైగా మంచం పట్టారు. దీంతో ఏ ప్రాంతంలో డయేరియా ప్రబలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ సరఫరా చేసే నీటిని విని యోగించుకోవాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అధికారుల బాధ్యత రాహిత్యం.. నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. తాగునీరు కలుషితం ఇద్దరిని బలి తీసుకుంది. ఇంకా ఎంతమంది ప్రాణాలుపోతే కానీ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడతారోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో డయేరియా వచ్చి నగరంలో ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ మారు అదే పరిస్థితి పునరావృతం అవుతుంది. ఇప్పటికే శారదకాలనీ, సంగడిగుంటలో ఇద్దరు మృతి చెందగా అనేకమంది జీజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇలా సంఘటన జరిగినప్పుడు తప్ప...


పట్టాభిపురం నాలుగో లైన్ లో మురుగు నీటిలోనే పైపులైను

హెచ్‌డీపీఈ పైపులైన్ల నెట్ వర్కు శిథిలం


నగరం రోజురోజుకు విస్తరిస్తుండటం, పైపులైను నెట్‌వర్కు పెరిగిపోవడం, అందుకు తగ్గట్లుగా సిబ్బంది నియామకాలు లేకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వం అప్పట్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ స్కీమ్ కింద తాగునీటి సరఫరా వ్యవస్థని ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. ప్రజలకు 24 గంటలు కుళాయిల ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీతో ఒప్పందం కూడా కుదుర్చుకొన్నది. ఆ మేరకు పలు కాలనీల్లో పైపులైన్ నెట్‌వర్క్ ఏర్పాటు పనులు కూడా చేశారు. ఈ క్రమంలో రూ.12 కోట్ల వరకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చారు. అయితే దాని వల్ల తమకు వస్తున్న అక్రమ ఆదాయానికి ఎక్కడ గండి పడుతుందోనని నగరపాలకసంస్థలో కొంత మంది అధికారులు, సిబ్బందే ప్రజలను ఎగదోసి ధర్నాలు, ఆందోళనలు చేయించారు. అలానే పైపులైను నెట్‌వర్కు అన్ని కాలనీలకు విస్తరింప చేయకుండా అడ్డుకున్నారు. దాంతో నిర్మాణం పూర్తి కాకుండానే ఆ ప్రాజెక్టు శిథిలమై పోయింది. పైపులైన్లలో నిరంతరం నీటి సరఫరా ఉంటే కలుషితం కావడానికి అవకాశం ఉండదు. పైగా నీటిని సరఫరా చేసే సంస్థకు పూర్తి జవాబు దారితనం ఉంటుంది. బృహత్తరమైన ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే నీటి సరఫరా ప్రమాణాలు ఎంతో మెరుగు పడి ఉండేవి. అయితే దీనికి నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది మోకాలడ్డారు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చి వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఆ ప్రాజెక్టుకి మంగళం పాడేశారు. ఆ తర్వాత వరల్డ్ బ్యాంకు స్కీమ్ అంటూ కొత్త పల్లవిని అందుకున్నారు. ఉన్న పాత పైపు లైన్లన్నింటిని మార్చేసి కొత్తవి ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. అందులో భాగంగా కొన్ని ప్రాంతాల్లో పనులు జరిగాయి. అయితే ఇళ్లల్లోకి ఏర్పాటు చేసే కుళాయి కనెక్షన్ పైపులైన్లను మాత్రం కాలువల్లో నుంచి తొలగించ లేదు. అవి తుప్పు పట్టి చిల్లులు పడుతుండటంతో వాటిల్లోకి మురుగునీరు చేరి సరఫరా సమయంలో కుళాయిల ద్వారా వస్తుంది. అదే ప్రైవేటు సంస్థకు నీటి సరఫరా ఇచ్చి ఉంటే ఎంతో బాధ్యతాయుతంగా ఉండేది.


మంత్రి వారి వీధిలో..

ఎన్నికల.. బదిలీలలు

ఎన్నికల సమీపిస్తోన్న తరుణంలో ఉద్యోగుల బదిలీలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల్లో రాజకీయ జోక్యం నివారించడమే బదిలీల ప్రధాన ఉద్దేశం. అయితే ఇప్పటి వరకు జరిగిన బదిలీల తీరు తెన్నులను పరిశీలిస్తే ఏ రాయి అయితే ఏమిటి పళ్లు ఊడ గొట్టుకోవడానికి అన్న చందాన ప్రక్రియ తయారైందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతల సిఫార్సులతో జరిగిన పోస్టింగ్‌లపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల ఉద్దేశమే అధికారపార్టీ ప్రాపకాన్ని తగ్గించడమై ఏకంగా వారి సిఫార్సు లెటర్లతోనే పోస్టింగ్‌లు దక్కించుకున్న వారు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్నారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేసే విధంగా కూడా కొన్ని చోట్ల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలను ఉద్యోగ సంఘాలు కూడా వ్యక్తం చేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం ప్రక్రియ పాలకపార్టీ కనుసన్నల్లో జరగడంతో బదిలీల లీలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

- వైసీపీ నేతల మాటే చెల్లుబాటు
- అధికార పార్టీ సిఫార్సు లెటర్లతో పోస్టింగ్‌లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈసీ ఆదేశాలు బేఖాతరు
- అధికార పార్టీ అనుకూల పోస్టింగ్‌లపై మండిపడుతోన్న టీడీపీ



బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశా లతో అధికారులు ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే ఉద్యోగుల బదిలీలను చేపట్టారు. ఒకే చోట మూడేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు స్థానికత కొలమానంగా బదిలీలను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులను బదిలీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అయితే ఈ చేర్పులు మార్పులు మొత్తం పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగు జిల్లాలో తమకు అనుకూలంగా ఉండే అధికారులను వెతికి మరీ వైసీపీ నేతలు తమకు అనకూలంగా ఉండే చోట పోస్టింగ్ వేయించుకున్నారు. విస్తృత పరిచయాలున్న కొంతమంది ఉద్యోగులు అయితే ఏకంగా వారే నేతలను సంప్రదించి మీ మాటే శిరసావహిస్తామనే వాగ్దానంతో అనుకున్న చోట బదిలీని బహుమానంగా పొందగలిగారన్న విమర్శలున్నాయి. ఈ తంతు ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే రెవెన్యూ, పోలీస్ విభాగాల్లో చోటుచేసుకుంది. ఈ రెండు విభాగాల నుంచి ఒక్క బాపట్ల జిల్లాలోనే 50 మందికి పైగా బదిలీలు అధికారపార్టీ నేతల ఆశీస్సులతోనే జరిగాయని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ సంఖ్య వందల్లో ఉన్నట్లు సమాచారం. రెవెన్యూలో తహసీల్దార్ల బదిలీలు ఎక్కువగా ఉండగా, పోలీసు విభాగంలో దాదాపు ప్రతి చోట ఎస్‌ఐ, సీఐలను బదిలీ చేశారు.

స్థానిక నేతల అంగీకారంతోనే..

ఉమ్మడి జిల్లాలు కొలమానంగా ఒకే చోట మూడేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో అనేక వింతలు చోటు చేసుకున్నాయి. వేరే జిల్లాల నుంచి ఇక్కడకు రావాలనుకున్న వారు అందుకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఆశీస్సులతో అనుకున్న చోటకు బదిలీ చేయించుకోగలిగారు. ఇటీవల జరిగిన బదిలీలలో దాదాపు 75 శాతం ఈ విధంగా జరిగినవే కావడం గమనార్హం. ఇక పోలీసు శాఖలో అయితే స్థానికంగా ఉన్న నేతల లెటరు ఆధారంగానే ఈ తంతు నడిచిందనే ఆరోపణలు ఆ శాఖ నుంచే రావడం గమనార్హం. అద్దంకిలో వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన నేత కనుసన్నల్లోనే ఉద్యోగుల బదిలీల పర్వం నడిచినట్లు తెలుస్తోంది. సీఐలు, ఎస్‌ఐల పోస్టింగ్‌ల విషయంలో ఆ నేత అంగీకారమే ప్రామాణికంగా బదిలీలు చేపట్టినట్లు సమాచారం. బాపట్ల రూరల్ పోస్టింగ్ విషయంలో సదరు నేత ఆదేశాలతోనే పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెవెన్యూలో అయితే నేతలు తమ అనుకూలురను ఆయా మండలాల్లో తహసీల్దార్లుగా నియమించుకోవడంలో విజయం సాధించారు. నిత్యం ఫ్యాక్షన్ గొడవలతో అట్టుడుకుతున్న పల్నాడు జిల్లాలో స్థానిక నేతల అండదండలతోనే 80 శాతం బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల అండదండలతో వారికి అనుకూలంగా జరిగిన ఈ బదిలీలపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

ఇక పారదర్శకతకు ఆస్కారం ఎక్కడ...

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అత్యంత పారదర్శకంగా జరగాల్సిన బదిలీలు పాలకపార్టీ నేతల అంగీకారంతోనే జరగడంపై విపక్ష టీడీపీ మండిపడుతోంది. బదిలీలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చి వదిలేసిందని, కానీ వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అస్మదీయులకు పదవుల పందేరం చేసి ఎన్నికల వేళ అక్రమాలకు రంగం సిద్ధం చేసుకుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీలు అన్నీ నిబంధనల ప్రకారమే జరిగినట్లు పైకి కనబడుతున్నా అనుకున్న చోట పోస్టింగ్ పొందిన వారంతా పాలకపార్టీ ప్రాపకం ఉన్నవారేనని ఈసీ ఈ అవకతవకలపై దృష్టి సారించాలని టీడీపీ అభ్యర్థిస్తోంది.

ఓట్లకు.. ఇంధనం



- ఎన్నికలు సమీపిస్తున్న వేళ కరెన్సీ కట్టలు సిద్ధం
- కోట్లు వెచ్చించాల్సిన ఆశావహులు
- నోటిఫికేషన్‌కు ముందే డబ్బు తరలింపు ?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో గెలుపునకు ధనమే కీలకం. పార్టీలు టిక్కెట్ కేటాయింపులో కూడా డబ్బును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. టిక్కెట్ ఇస్తే ఎంత ఖర్చు పెట్టగలరు... ఎలా సమకూర్చుకుంటారు అనే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగలిగిన నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాల్లో సీనియర్లు, జూనియర్లు తేడా లేదు. డబ్బు భారీగా ఖర్చు చేయగల సత్తా ఉన్న నేతలకే పార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయన్న ప్రచారం ఉంది. ధనం తర్వాతే కులానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకటి రెండు టిక్కెట్‌లను మాత్రమే సమర్థత ఆధారంగా ఇస్తు న్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనా వేసున్నారు. ఈ మేరకు లెక్క కడితే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.1,700 నుంచి రూ.2,100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాగా ఉంది. ఎన్నికల్లో నిబంధనల మేర చూపించే ఖర్చు మినహా మిగతాది నల్లధనమే ఖర్చు చేస్తారు.

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు...

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు అవకాశాలు ఉండే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు అధికారికంగా టిక్కెట్‌లు పూర్తిస్థాయిలో ప్రకటించనప్పటికీ అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో డబ్బు సమకుర్చుకోవడంతో వారంతా నిమగ్నమయ్యారు. నోటిఫికేషన్ వెలువడే లోపు డబ్బు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల రూ.2,000 కూడా ఇచ్చారు.

డబ్బు సమకూర్చుకోవడంలో నిమగ్నం..

నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ వరకు ఊహించని రీతిలో డబ్బు ఖర్చు అవుతుంది. ప్రచారానికే ఎక్కువగానే ఖర్చుచేయాల్సి ఉంది. మద్యం కూడా ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది. మద్యం ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో కేవలం మద్యానికి ఖర్చు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పోలింగ్ ఏజెంట్లు, నేతల కొనుగోలు జరుగుతుంటాయి. వీరికి లక్షల్లో చెల్లిస్తుంటారు. విందులు, వినోదాలకు కూడా భారీగానే ఖర్చు చేస్తుంటారు. ఓటు కొనుగోలు అన్నిటికన్నా ప్రధానమైనది. ఈ సారి ఎన్నికల్లో ఓటు రేటు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో లక్ష నుంచి 1.50 లక్షల ఓట్లు కొనుగోలు చేస్తుంటారు. దీని ప్రకారం ఓట్ల కొనుగోలుకు 25 నుంచి 30 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల మూడవ వారంలో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం నేపథ్యంలో అప్పటికల్లా డబ్బు సమకూర్చుకోవడం పూర్తి చేసుకోవాలని వారు భావిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడితే తనిఖీలు ముమ్మరంగా ఉంటాయి. దీంతో ఆ సమయంతో డబ్బు ఒక చోట నుంచి మరో చోటికి చేరవేసే పరిస్థితులు ఉండవు. దీంతో నోటిఫికేషన్ వెలువడే లోపలే డబ్బు ప్రక్రియ పూర్తి చేసుకునే దిశగా అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి ఎన్నికల ఖర్చు ఉంటుందని అంచనా. నల్లధనమే ఎన్నికల్లో ఖర్చు చేస్తారన్నది బహిరంగ రహస్యమే.

- లక్షలు కొల్లగొడుతున్న లాటరీ
- సామాన్యుడి జేబుకు చిల్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలువు దోపిడీ
- వైసీపీ నేతల అండతో చెలరేగుతున్న నిర్వాహకులు

తగిలేదేలే!




నిర్వాహకులు రాసే నెంబర్‌లు

వంద రూపాయలు కట్టి లాటరీ టికెట్ కొనండి.. మీదే అదృష్టం.. లాటరీ తగిలితే రాత్రికి రాత్రే లక్షాధికారులు కావచ్చు.. అంటూ వల వేస్తున్నారు. దీంతో ఓసారి తమ అదృష్టం పరీక్షించుకుందామని పేద, మధ్య తరగతివారు చమటోడ్చి సంపాదించుకున్న డబ్బుతో టికెట్లు కొంటున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు.

గుంటూరు, ఫిబ్రవరి 11 : అదృష్టం వరిస్తే కనక వర్షం కురిసినట్లేనని నిర్వాహకులు ఆశచూపి ఎర వేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో అధికారికంగా కొనసాగుతున్న లాటరీలో ఎంతోమందికి లాటరీ తగిలి కోట్లు వచ్చిన విషయాన్ని ఇక్కడ ప్రచారం చేస్తూ మీరు కూడా అదేవిధంగా కోట్లు సంపాదించుకోవచ్చు అని ఆకర్షిస్తున్నారు. ఈ లాటరీ మాయాజాలంలో నిర్వాహకులు లక్షల్లో కొల్లగొడుతుంటే టికెట్లు కొనుగోలు చేసిన సామాన్యులు దివాళా తీస్తున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలగకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు. ఆన్‌లైన్‌లో సాగే ఈ లాటరీకి ఎటువంటి అనుమతులు లేవు. దీని నిర్వాహకులు ఎవరు? ఈ వెబ్‌సైటును ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారు? ఫలితాలను ఎవరు విడుదల చేస్తున్నారు. ఈ డబ్బులు అన్నీ ఎక్కడికి చేరుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు.

ఆట సాగేదిలా...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు కేంద్రా ల్లో రోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో లాటరీ ఫలితాలను విడుదల చేస్తారు. అప్పటినుంచి ఆ తర్వాత రోజు లాటరీ కోసం టికెట్ల విక్ర యం ప్రారంభిస్తారు. తర్వాత రోజు మధ్యాహ్నం 2:30 గంటల వరకు టికెట్ల విక్రయం జరుగుతుంది. ఆ తర్వాత ఏఏ నెంబర్ల నుంచి ఏ నెంబర్ల వరకు టికెట్లు విక్రయాలు జరిగాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నిర్వాహకుడి దృష్టికి వెళ్తుంది. టికెట్ ధర రూ.40 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. ఒక్కో లాటరీపై ఐదు అంకెల నెంబర్ ఉంటుంది. అది తగిలితేనే లాటరీ వచ్చినట్లు. రూ.40తో టిక్కెట్ కొనుగోలు చేస్తే ఐదు అంకెలు లాటరీ తగిలితే రూ.80 వేలు ఇస్తారు.

పక్కాగా మోసం చేసేదిలా..

ఈ లాటరీ వ్యవహారంలో పక్కాగా మోసానికి పాల్పడుతున్నారు. అదెలా అంటే.. ఈరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి టికెట్ల విక్రయం ప్రారంభమవుతుంది. తర్వాత రోజు నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలు వెల్లడిస్తారు. ఫలితాల వెల్లడికి గంటన్నర ముందుగా టికెట్ల విక్రయం పూర్తవుతుంది. అయితే నిర్వాహకులు ముందుగా అన్ని టికెట్లు విడుదల చేయకుండా కొన్ని టికెట్లు వారి వద్ద ఉంచుకుంటారు. ఆ టికెట్ల నంబర్లనే ఆన్‌లైన్‌లో ఉంచుతారు. అంటే ఎవరు ఎన్ని టికెట్లు కొనుగోలు చేసినా లాటరీ మాత్రం రాదని స్పష్టంగా అర్థం అవుతుంది. అంతేగాక లాటరీ ఫలితాలు విడుదల చేయడానికి గంటన్నర ముందే టికెట్ల విక్రయం పూర్తవుతుంది కాబట్టి టికెట్లు విక్రయించిన వారందరూ ఏ ఏరియాలో ఎన్ని నెంబర్ల టికెట్‌లు విక్రయించిందీ ఆన్‌లైన్‌లో ఉంచుతారు. దీనిని బట్టి విక్రయించని టికెట్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. దీంతో కొందరు రిటైల్ టికెట్ విక్రేతలు ఇదే విషయాన్ని కొనుగోలుదారులకు చూపి మరికొన్ని టికెట్లు కొంటే లాటరీ తగిలేదే అంటూ మరింత ఆశ కల్పిస్తున్నారు.

శంఖారావంతో వైసీపీలో వణుకు

● మాజీ మంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, ఫిబ్రవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన శంఖారావంతో వైసీపీలో వణుకు ప్రారంభమైందని మాజీమంత్రి, సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల శంఖారావం పేరుతో లోకేశ్ మరో యాత్రకు శ్రీకారం చుట్టడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం, వైసీపీ నేతల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. నారాలోకేశ్ యువగళం పాదయాత్ర సమకాలిన రాజకీయ ఉద్యమాల్లో సరికొత్త అధ్యాయం అన్నారు. యువగళం ఆరంభం నుంచి సీఎం జగన్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా అదరకుండా బెదరకుండా లోకేశ్ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశారని ఆయన గుర్తుచేశారు. పాదయాత్ర తర్వాత ప్రజలతో మమేకమ య్యేందుకు శంఖా రావం పేరుతో లోకేశ్ ప్రజల్లోకి వస్తున్నారన్నారు. ప్రజల్లోకి వెళ్ళి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలను, టీడీపీ మేనిఫెస్టోను కార్యకర్తలకు ప్రజలకు తెలియ జేసి చైతన్యం తీసుకు రానున్నారన్నారు. 40 నుంచి 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని, పాదయాత్రకు వచ్చిన స్పందనే శంఖారావానికి కూడా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు బాధితులుగా ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు ఇంటికి పంపుదామా? అని ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రబాబు చల్లని పాలనకోసం, టీడీపీ, జనసేన కూటమి ప్రభు త్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

నేటి నుంచి సికింద్రాబాద్‌కు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మౌలాలి - సనత్‌నగర్ బైపాసు రైల్వేలేన్ ఎన్‌ఐ పనుల కోసం గత వారం నుంచి రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లని సోమవారం నుంచి పునరుద్ధరించనున్నారు. నెంబరు. 12747/12748 గుంటూరు - వికారాబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు - సికింద్రాబాద్ వయా కాజీపేట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. అలానే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లిస్తున్నది. కాచీగూడ - మిర్యాలగూడ - నడికుడి మధ్యన నడిచే ప్రత్యేక ప్యాసింజర్ రైళ్లను కూడా ఎన్‌ఐ వర్కులు కారణంగా రద్దు చేసింది. ఈకారణంగా మిగతా రైళ్లలో వారం నుంచి తీవ్ర రద్దీ నెలకొంటున్నది. ముఖ్యంగా శబరి, ఫలక్‌నుమా, నరసపూర్, చెన్నై, నారాయణాద్రి, జన్మభూమి, విశాఖ తదితర రైళ్లలో జనరల్ భోగీలే కాకుండా రిజర్వుడ్ కోచ్‌లు రద్దీగా ఉంటున్నాయి. జనరల్ భోగీల్లో అయితే కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి. కాగా ఎన్‌ఐ వర్కులు పూర్తి కావడంతో సోమవారం నుంచి అయా రైళ్లను పునరుద్ధ రిస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.



ఉప్పలపాడు పక్షులకేంద్రాన్ని గుంటూరు జిల్లా లేబర్ కోర్టు జడ్జి డి.తిరుమలరావు ఆదివారం సందర్శించారు. గుంటూరుకి అతి సమీపంలో ఇంత మంచి పార్కు ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయనకు పక్షుల కేంద్రం లోగో, టీ షర్ట్‌ని అటవీశాఖ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు వెంకటేశ్వరరావు, సంతోష్, పక్షుల కేంద్రం చైర్మన్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - పెదకాకాని.

సినీరంగంలో లెజెండ్ సూపర్‌స్టార్ కృష్ణ

● ప్రముఖ ఎన్నారై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

● బుర్రిపాలెంలో కృష్ణ సంస్మరణ సభ

తెనాలి, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 11: కుటుంబంలో ఎవరో ఒకరే ఆదర్శవంతులుగా ఉండటం సహజమని, కుటుంబం మొత్తం ఆదర్శ విలువలను పుణికి పుచ్చుకోవడం ఒక్క సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబానికే సాధ్యమైందని ప్రముఖ ఎన్నారై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుర్రిపాలెంలో జరిగిన కృష్ణ సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ నేటి యువతరానికి ఆయన ఆదర్శవంతమైన విలువలు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అపూర్వ సోదరులంటే ఇతిహాసాల్లో చూసేవారమని, ఆ స్వగ్రామంలోనే కృష్ణ, ఆదిశేషగిరిరావుల సోదరుల ప్రేమ చూస్తే అన్నదమ్ములు ఎవరికైనా అది ఒక మార్గదర్శకమే అవుతుందన్నారు. ఆయన పుట్టిన రోజునే నేను కూడా పుట్టడం నాకు గర్వంగా ఉందని, నేను వేయబోయే సామాజిక, రాజకీయ అడుగులన్ని ఆయన ఆదర్శాలను మార్గదర్శకంగా తీసుకుని ముందుకు వెళతానన్నారు. మాజీ సభాపతి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, సినీ పరిశ్రమలో ఏ కొత్తదనం వచ్చిన, ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం వచ్చిన దానిని సినీ రంగానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తిగా కృష్ణ నిలిచిపోతారన్నారు. ఆయన ఒక లెజండ్ అని, నేటి యువతరానికి మార్గదర్శకులు అవుతారని మనోహర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయ సభ కాకపోయినా పెమ్మసాని వంటి ఔత్సాహిక రాజకీయ వేత్తల కోసం మాట్లాడవలసి వస్తుందని, మన భవిష్యత్ కోసం చంద్రశేఖర్ వంటి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం మనపైనే ఉందన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సూపర్‌స్టార్ కృష్ణ సినీ రంగంలోనే హీరో కాదని సామాజిక, రాజకీయ రంగాల పరంగాను ఆయన ఒక ఆదర్శవంతమైన హీరోగా నిలిచిపోతారన్నారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగంలో విజయవంతమైన పాత్ర పోషించడం, పలువురికి ఆదర్శప్రాయంగా నిలవడం ఆయన ఒక్కడికే సాధ్యమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ, తమకు సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబంతో ఎనలేని బంధం ఉందని, ఆయన బాటలోనే హీరో మహేష్‌బాబు కూడా పయనిస్తున్నారని, కృష్ణ లేని లోటు రెండు తెలుగు రాష్ట్రాలపైన ఉంటుందన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, అభిమాన సంఘాలకు ఏ హీరో ఇవ్వనంత ప్రాధాన్యాన్ని కృష్ణ ఇచ్చేవారని పేర్కొన్నారు. బుర్రిపాలెం గ్రామానికి ఆయన చేసిన సేవలను స్థానికులు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, వివిధ ప్రాంతాల కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆయన సోదరుడు ఆదిశేషగిరిరావు, నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్, రాయపాటి శ్రీనివాస్ తదితరులు

చంద్రబాబు, పవన్‌లు చరిత్ర సృష్టించబోతున్నారు

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● జంపని గ్రామంలో టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ శ్రేణులు



మాజీ మంత్రి ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ శ్రేణులు

వేమూరు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కలిసి చరిత్ర సృష్టించబోతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని జంపని గ్రామంలో టీడీపీ రాష్ట్ర ముస్లిం, మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 40 ముస్లిం కుటుంబాల వారు ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క ఛాన్సు అంటూ రాష్ట్రాన్ని, ప్రజలను నట్టేట ముంచిన జగన్మోహనరెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వైసీపీకి అభ్యర్థులు దొరకడం కరువైందని, టీడీపీ తలుపులు తెరిస్తే ఆగే పరిస్థితుల్లో లేరన్నారు. నాలుగోసారి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా తాను నిలబడుతున్నానని తాను చేసిన మంచి పనులను చూసి ఆదరించి గెలిపిస్తారన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. వేమూరులో పోటీ చేసేందుకు సంతనూతలపాడు నుంచి వచ్చిన అశోక్‌బాబుకు స్థానిక ప్రజలు, రాజకీయ వాతావరణంపై అవగాహన లేకుండానే తనపై, విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐకమత్యంతో ఎన్నికల్లో నిలబడే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, డాక్టర్ షేక్ జాన్‌సైదా, షేక్ ఖాదర్‌వలి, మహబూబ, జానీ, కరిముల్లా, కాలేషా, నాయబ్‌రసూల్, ఫరీద్, ఖాజా, సాహిద్, బాబి, చింతల గోపి, సల్మాన్‌ఖాన్, యూసఫ్, ఆజాద్, ఫీర్ అహ్మద్, మౌలాలి, రబ్బాని, సద్దాం, నజీర్, అక్బర్, వెలుతుర్ల శ్రీనివాసరెడ్డి, ముద్రబోయిన సీతయ్య, జానీ, తదితరులు కుటుంబ సభ్యులతో పార్టీ కండువాలు కప్పుకున్నారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు డి.వి.సుబ్బారావు, బిసి సంఘ నాయకులు వాసుదేవరాయుడు, వెలినేని రంగారావు, వేల్పుల రవి, దొడ్డపనేని సుధాకర్, తొలుచూరి కోటేశ్వరరావు, రహంతుల్లా పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి11: పొన్నూరు పట్టణంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అర్బన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం ఒంగోలుకు చెందిన సుబ్రహ్మణ్యం (30) గత కొంతకాలంగా పొన్నూరు పట్టణంలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇస్లాంపేట్‌లోని అద్దెకు ఉండే గృహంలో సుబ్రహ్మణ్యం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి బంధువులకు ఫోన్‌లో సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్ ఫోటో)

బొల్లాపల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని గంగుపల్లి- కండ్రిక మధ్యలో ఇంటర్మీడియట్ విద్యార్థి బండెల అఖిల్(17) ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అఖిల్ సొంత ఊరు ప్రకాశంజిల్లా, పుల్లల చెరువుమండలం, అక్కపాలెం. కాగా గ్రామం నుంచి నాయనమ్మ ఊరైన గంగుపల్లి వచ్చి వెళ్తున్న సమయంలో వినుకొండ నుంచి మన్నేపల్లి తండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు కండ్రిక చెరువు మలుపు వద్ద బైక్‌ను ఢీకొనటంతో అఖిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈఘటనతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. బొల్లాపల్లి ఎస్‌ఐ చెన్నకేశవులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని యువకుడి మృతి



మహమ్మద్(ఫైల్)

పెదకాకాని, ఫిబ్రవరి11: నంబూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో జరుగుతున్న దీనీ ఇజ్‌తిమ సభలకు వచ్చిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం జరిగింది. కడప పట్టణం ఆగాడి వీధికి చెందిన షేక్ మహమ్మద్ (34) రెండు రోజుల క్రితం సభలకు వచ్చాడు. స్నేహితులతో కలిసి టిఫిన్ చేసేందుకు జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. పని ముగించుకొని తిరిగి సభల వద్దకు వెళ్లేందుకు బయలుదేరాడు. కంతేరు అడ్డు సమీపంలో హైవేపై గుంటూరు నుంచి విజయవాడ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన మహమ్మద్ అక్కడికక్కడే మరణించాడు.

వైన్ షాపు వద్ద ఘర్షణ ... ఒకరి మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11: చిలకలూరిపేట పట్టణంలోని సింగ్ నగర్ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం జరిగిన గొడవ కేసులో నిందితుడు సురేష్ నాయక్(40) అనే వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు. సురేష్ నాయక్‌కు వెంకటేశ్వర్లు నాయక్‌తో మద్యం, డబ్బులు విషయంపై గతంలో గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. ఆ గొడవ సందర్భంగా సురేష్‌నాయక్ తలపై వెంకటేశ్వర్లునాయక్ అనే వ్యక్తి నాపరాయితో బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత సురేష్‌నాయక్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో వున్న నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్ కోసం రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నారా లోకేశ్ ఆధ్వర్యంలో


వాలీబాల్ పోటీలు ప్రారంభం

● ప్రారంభించిన టీడీపీ నేత నందం అబద్ధయ్య

● విజేతగా నిలిచిన జట్టుకు రూ. లక్ష ప్రైజ్ మనీ..

మంగళగిరి, ఫిబ్రవరి11: మంగళగిరి వాలీబాల్ లీగ్-3 టోర్నీ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో ఈ నెల 18వ తేదీ వరకు వాలీబాల్ టోర్నీ జరుగనుంది. మంగళగిరి టీడీపీ, జనసేన నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మైదానంలో కొద్దిసేపు వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మొదటి రోజు రెండు కోర్టుల్లో 8 జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో నిర్వహించే ఈ పోటీల్లో 58 జట్లు తలపడుతున్నాయని చెప్పారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీల్లో ఎలాంటి ప్రవేశ రుసుము తీసుకోకుండా అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలు, తృతీయ బహుమతి కింద రూ.25 వేలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 11: చింతకాయలు కోసేందుకు వెళ్ళిన వ్యక్తి చెట్టుపై నుంచి జారి కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని వేల్పూరు గ్రామంలో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వేల్పూరుకు చెందిన మారాసు నాగేశ్వరరావు(64) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. వేల్పూరు నుంచిఇ అలవాల వెళ్ళే మార్గంలో చెరువుకట్టపై చింతకాయలు కోసేందుకు ఆదివారం ఉదయం వెళ్ళాడు. చింతచెట్టు పైకి ఎక్కిన నాగేశ్వరరావు కొమ్మపై నుంచి కాలుజారి కింద నేలపై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు టీడీపీలో చురుగ్గా ఉంటూ పార్టీకి ఎనలేని సేవలందించారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని జడ్పీటీసీ పారా హైమావతి, గ్రామ టీడీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

ప్రజలను మెగా మోసం చేసిన జగన్‌రెడ్డి

● 1517వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 11: ఆంధ్రా ప్రజలను సీఎం జగన్‌రెడ్డి మెగా మోసం చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయకుండా అసమర్థ ముఖ్యమంత్రిగా పేరు గడించారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విమర్శించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉండాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు నిరసనలు, దీక్షలు ఆదివారం నాటికి 1,517వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, రాజధాని అమరావతిని కేంద్రం కూడా గుర్తించిందన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా మూడు రాజధానుల అంశం పక్కన పెట్టి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని మాండమస్ తీర్పునిచ్చిందన్నారు. అయినా జగన్‌రెడ్డి సాధ్యం కాని మూడు పట్టుకొని వేలాడుతున్నాడన్నారు. ఐదుకోట్ల మంది ఆంధ్రులను మోసం చేస్తూ మూడు ముక్కల ఆటకు తెరతీశారన్నారు. అమరావతి అభివృద్ధిని కొనసాగించే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, నెక్కల్లు, అనంతవరం తదిత రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



జ్యోతిప్రజ్వలనతో అలుమ్నిమీట్ సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఉపకులపతి శారద జయలక్ష్మీదేవి, పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

● ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 11: మానవాళికి అన్నం పెట్టే రైతు ఆదర్శవాది అని, ఇవ్వటంలోని విలువను ప్రతి ఒక్కరు రైతు నుంచే తెలుసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో అలుమ్ని అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజి డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి ప్రారంభించారు. అనంతరం టీవీ నాథ్ ఆడిటోరియంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు తమకు విద్య నేర్పిన కళాశాల రుణం తీర్చుకోవటం హర్షణీయమన్నారు. విద్యారంగమైన వ్యాపారరంగమైన శాస్త్రసాంకేతిక రంగమైన అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. బీపీటీ 5204 విత్తు బాపట్ల నుంచి రావటం చాలా గర్వకారణమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పూర్తి చేయటానికి కృషి చేసిన కళాశాల సోసియేట్ డీన్ వి.శ్రీనివాసరావు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో మరింత అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి పూర్వవిద్యార్థి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డి.పాపిరెడ్డి, బి.రంగారావు, భాస్కరరావు, వాణిప్రసాద్, రత్నసుధీర్, నాగేశ్వరరావు, 1980వ బ్యాచ్ విద్యార్థి హరిప్రసాద్ భవన నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం ఇవ్వటంతో వీరికి పూర్వవిద్యార్థులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



క్రెడాయ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి తదితరులు

ఘనంగా క్రెడాయ్ నూతన భవన ప్రారంభం

గుంటూరు(కార్పొరేషన్), జనవరి11: గుంటూరు నగరంలోని మహాత్మా గాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన క్రెడాయ్ గుంటూరు చాప్టర్ భవనాన్ని క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి దంపతులచే ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు ఇంతవరకు సొంత భవనం లేదని, దినదినాభివృద్ధి చెందుతున్న క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు స్థలాన్ని ఇచ్చి, భవనం నిర్మించి ఇవ్వడం మాకుటుంబ సభ్యులందరికీ ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశం నాకు దక్కినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ మరింత అభివృద్ధి పథంలో నడపడానికి శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. క్రెడాయ్ నేషనల్ మాజీ ప్రెసిడెంట్, తెలంగాణ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ సొంత భవనానికి స్థలం ఇచ్చి, భవనాన్ని నిర్మించి ఇచ్చిన శివారెడ్డి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ కార్యదర్శి రామిరెడ్డి, బి.రాజా, వైవీ రమణారావు, గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధర పైపైకి..

● గడిచిన రెండు వారాల్లో కేజీకి రూ.100 పెరుగుదల

● రూ.6 వద్ద కొనసాగుతున్న కోడి గుడ్డు ధర

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రెండు వారాల్లో చికెన్ ధర దాదాపుగా 50 శాతం పైగా పెరిగింది. ఎండలు పెరుగుతుండటం, ఫారంల నుంచి కోళ్లు తక్కువగా వస్తుండటం, కొన్ని చనిపోతుండటంతో వ్యాపారస్తులు ధర పెంచేశారు. రెండు వారాల క్రితం కేజీ చికెన్ ధర కేవలం రూ.160 మాత్రమే ఉన్నది. అలాంటిది ఈ ఆదివారం కేజీ జిల్లాలో ప్రాంతాన్ని బట్టి రూ.240 నుంచి రూ.260 మధ్యన విక్రయించారు. అయినప్పటికీ ఎప్పటిలానే నగరంలో ఈ ఆదివారం కూడా వ్యాపారాలు కొనసాగాయి. కాగా చికెన్‌తో పోల్చితే చేపలే తక్కువ ధరకు లభ్యమౌతున్నాయి. కేజీ చేపలు రూ.150 నుంచి రూ.200 లోపు ధరకే లభిస్తున్నాయి. పైగా ఇవి ఆరోగ్యానికి మంచిదన్న నానుడి ఉండటంతో ఈ వారం చేపల విక్రయాలు గుంటూరు నగరంలోని మిర్చియార్డు, గుజ్జనగుళ్ల, టీజేపీఎస్ కళాశాల, అమరావతి రోడ్డు, అడపాబజార్ వద్ద జీఎన్‌టీ రోడ్డుపై పెద్దఎత్తున జరిగాయి. చికెన్ ధరకు టైగర్ రొయ్యలు కూడా లభించాయి. మటన్ ధర మాత్రం ఆకాశమే హద్దు అన్నట్లుగా పెరుగుతున్నది. పలుచోట్ల కేజీ రూ.860కి విక్రయించారు. కొన్ని షాపులలో అయితే రూ.900 దాటిపోయింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలి

● జాతీయ ధోబీ సంఘ్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

● ముగిసిన తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు పాదయాత్ర

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11: రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌గా బీసీల మహాపాదయాత్ర నిర్వహించడం జరిగిందని, జాతీయ ధోబీ సంఘ్ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని ప్రధాన డిమాండ్‌గా తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు చేపట్టిన బీసీల మహాపాదయాత్ర సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్దకు రాగా అక్కడ నేతలు మాట్లాడారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కనకదుర్గమ్మ గుడి వద్ద మహాపాద ముగుస్తుందన్నారు. రజకులను ఎస్సీల జాబితాలో చేరుస్తామని గత 75 ఏళ్లుగా అన్ని రాజకీయ పార్టీలు చెబుతూ మభ్యపెట్టాయని వ్యాఖ్యానించారు. ప్రతి పార్టీ రజకులను ఎస్సీల జాబితాలో చేర్చే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో అయా పార్టీలను రజకుల ద్రోహులుగా చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశన శంకరరావు, పారేపల్లి మహేష్, బీసీ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం బ్యారేజి వద్ద బీసీల మహాపాదయాత్ర

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

డయేరియా మరణాలు ప్రభుత్వ హత్యలే !

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు నరపాలక సంస్థ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని, కలుషితనీరు తాగి డయేరియాతో సంభవించిన మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ నియోజక వర్గంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో కలుషిత నీరు వస్తోందని ప్రజలు కొద్ది రోజులుగా గగ్గోలు పెడు తున్నా, అధికార యంత్రాంగం స్పందిచలేదన్నారు. కుళాయిల్లో వచ్చే నీళ్ల తాగాలంటే భయపడే పరిస్థితి కల్పించారన్నారు. కలుషిత నీరు తాగి పలు వురు డయేరియా లక్షణాలతో ఆస్పత్రి పాలవుతున్నా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చేరినవారే కాకుండా అనేక మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో, ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతుంటే వారిని ప్రభుత్వం ఇంత వరకు బాధితులుగా గుర్తించలేదన్నారు. ఇప్పటికే ఇద్దరు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. ఘటనపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

విడదల రజిని రాజీనామా చేయాలి

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రబలిన డయేరియాను అరికట్టడం, బాధితులకు వైద్యం అందించడంలో విఫలమైన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని నైతిక బాధ్యత వహించి, తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరపాలక సంస్థ అధికారులతో బోగస్ ఓట్లు ఎలా చేర్పించానే అంశాలకు ప్రాధాన్యతనిస్తూ సమావేశాలు నిర్వహించిన విడదల రజిని నగరంలో డయేరియా ప్రబలి ప్రజలు చనిపోతుంటే తాగు నీటి రిజర్వాయర్లను పరిశీలించింది లేదన్నారు. ప్రజల ఆరోగ్యంపై ఏమాత్రం చిత్తశుద్ధిలేని ఆమెకు పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల చేతిలో పరాభవం తప్పదని డాక్టర్ నిమ్మల శేషయ్య స్పష్టం చేశారు.

పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

గుంటూరు, ఫిబ్రవరి 11: మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం తెలుగువారికి గర్వకారణమని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండు రంగవిఠల్‌లు అన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య నేతలు పలువురు పాల్గొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రకేసరి అభిమానసంఘం నేత, కార్పొరేటర్ ఈచంపాటి వెంకట కృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో బ్రాడీపేట శంకర్‌విలాస్ సెంటర్ ప్రకాశం చౌక్‌లో ఆంధ్రకేసరి విగ్రహం వద్ద పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు.

జగన్‌రెడ్డి అర్జునుడు కాదు.. అధముడు

● ధ్వజమెత్తిన జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల

గుంటూరు, ఫిబ్రవరి 11: సీఎం జగన్‌రెడ్డి తనకుతాను మహాభారతంలో అర్జునుడని పదేపదే చెప్పుకుంటున్నారని, నిజానికి జగన్‌రెడ్డి అర్జునుడు కాదని, పరిపాలన చేతకాని అధముడని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ మండిపడ్డారు. ఆదివారం 56వ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పులిగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలలో 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు. నేరెళ్ల సురేష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏ వర్గం వారిని కదిలించిన కన్నీళ్లు, కష్టాలు తప్పా ఎవరి ముఖంలోనూ సంతోషం లేదన్నారు. వైసీపీ అరాచలకాలు, దాష్టికాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో నెలకొన్న ఆగ్రహానికి రాబోయే ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని నేరెళ్ల సురేష్ తెలిపారు. కార్యక్రమంల జనసేన రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కాండేయబాబు, జనసేన కార్పొరేటర్లు పద్మావతి, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

గిరిజన మహిళ ప్రాణాలు తీసిన ప్రభుత్వం

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు తాగి గిరిజన మహిళ ప్రాణాలు పోవడానికి ప్రభుత్వమే కారణమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలై గుంటూరు జీజీహెచ్‌లో చేరుతున్న వారికి ప్రభుత్వం కనీసవైద్యం అందించలేకపోయిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుడైన రాజన్నదొర డిప్యూటీ సీఎంగా ఉండి కూడా ఆయన ఏరోజు గిరిజనుల గురించి పట్టించుకున్నది లేదన్నారు. గిరిజన మహిళ పద్మ మృతికి ప్రభుత్వమే కారణమని చెప్పే దమ్ము రాజన్నదొరకు ఉందా? వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీని రాజన్నదొర ప్రశ్నించగలరా? అని సవాల్ విసిరారు. సమావేశంలో మూడవత్ శ్రీను నాయక్, సౌపాటి రత్నం, బత్తుల భాస్కర్, చినుకూరి రవి, వెంకటేష్, కొండలు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి చేయూతనివ్వండి

● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుకు విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవ రి11: ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం మరిన్ని పథకాలను రూపొందించి వారి అభ్యున్నతికి కృషిచేయాలని మాలమహానాడు నాయకులు ఈమని చంద్రశేకర్, టీడీపీ రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులో మాజీ మంత్రి, టీడీపీ నక్కా ఆనంద్‌బాబును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ జగనన్న దగాకోరు పాలనను గద్దెదించే తారకమంత్రం జైభీమ్ చంద్రన్న అని తెలిపారు. జగన్ పాలనలో బడుగులు ఆర్థికంగా అణిచివేయబడ్డారని టీడీపీ- జనసేన అధికారంలో రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కార్పొరేషన్‌లకు తక్షణమే బడ్జెట్ కేటాయించి సబ్సిడీ రుణాలు అందజేసి ఆర్థికంగా ఆదుకుంటామన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: స్థానిక బృందావనగార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్‌కాసరనేని సదాశివరావు కళాసమితి 12వ నాటకోత్సవాలలో భాగంగా ఆదివారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ సభ్యులు యర్రా ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా డాక్టర్ జక్కంపూడి సీతారామారావు, ఎస్ ఆర్కే ప్రసాదు, డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంస్థ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు, రామినేని వెంకట్రావు పాల్గొని 30 మంది విద్యార్థులకు రూ. 2 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. సభానంతరం కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ గుంటూరు వారిచే బొమ్మిడి రామకృష్ణ రచన, దర్శకత్వంలో 'నాలోన నీవే' నాటికను ప్రదర్శించారు. సుదర్శన్ సూపర్‌స్పెషాలిటి కంటి వైద్యశాల డాక్టర్ గణేషుని రాజేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.



పురస్కార గ్రహీతలతో మంత్రి విడదల రజిని, నిర్వాహకులు

ఘనంగా 'స్వరరత్న' పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: గాయకులు పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకుని కళాదర్బార్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇన్నర్ రింగురోడ్డు, శిల్పారామంలో విశిష్టగాయని, గాయకులకు అందించే 'స్వరరత్న' పురస్కారాలు కార్యక్రమం వేడుకగా జరిగింది. కార్యక్రమానికి కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి విడదల రజిని, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్, ఆత్మీయ అతిథిగా ఘంటసాల కృష్ణకుమారి హాజరై పురస్కార గ్రహీతలను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఘంటసాల సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది, కార్యక్రమంలో పరిషత్ సభ్యులు డీ.బాలస్వామి, రాజశేకర్, చంద్రబాబు, మిరియాల ప్రసాదు, మిరియాల గోపి, పురుషోత్తప్రసాదు, సుదీర్‌బాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో స్థానిక నాజ్‌సెంటర్ కూడలిలోని ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు.

డయేరియా మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

● ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యమే కారణం
● నక్కా ఆనందబాబు, మొహమ్మద్ నసీర్
● మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆనందాబాబు, నసీర్, కనపర్తి

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కలుషిత నీరు తాగి చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సహా వారిరువురు మృతురాలి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గుంటూరు నగరంలో కలుషిత మంచినీటి సరఫరా ఇద్దరు చనిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కుప్పలు తెప్పలుగా జనం చికిత్స పొందుతున్నారని, ముఖ్యంగా దళితులు నివసించే ప్రాంతాలలో ఈ కలుషిత నీటి తీవ్రత ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర లేచి బాధితులకు న్యాయం చేయాలని, చికిత్స పొందుతున్న వారికి వైద్యం అందివాలని డిమాండ్‌చేశారు. మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పులో కొన్ని నెలలుగా కలుషిత నీరు, వాటర్ రిజర్వాయర్ల దుస్థితి గురించి నగర కమిషనర్‌కి, అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన పట్టించుకున్న దాఖలు లేవని అన్నారు. నగర్ మేయర్, ఎమ్మెల్యే గానీ ఆవైపు తొంగి చూసిన పాపాన పోలేదన్నారు. కలుషిత నీటి వల్ల మూడు రోజుల్లో ఇద్దరు చనిపోయారని, 20 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ నుంచి పైపుల ద్వారా వచ్చే నీరు పైపులు మరమ్మతులతో కలుషితమవుతుందని చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఈ మరణాలకు కారణం ముమ్మాటికి ప్రభు త్వం, నగరపాలక సంస్థ అధికారులేనని ఆరోపించారు. మృతుల, బాధితుల కుటుంబాలకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గొళ్ల ప్రభాకర్, మహంకాళి నరసింహరావు, శ్రీను నాయక్, సూరేశ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీఆర్ స్టేడియం వద్ద వున్న వాటర్ ట్యాంకును టీడీపీ నాయకులతో కలిసి ఆనందబాబు, నసీర్‌లు పరిశీలించారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి

● వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
● డయేరియా రోగుల ఆరోగ్యపరిస్థితిపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని, పక్కన కలెక్టర్, మేయర్, కమిషనర్

గుంటూరు, (తూర్పు) ఫిబ్రవరి 11: వాంతులు విరేచనాలతో గుంటూరు జీజీహెచ్‌లో చేరిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వాంతులు, విరేచనాలతో జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితులపై వైద్యశాఖ, నగరపాలక సంస్థ అధికారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ చేకూరి కీర్తి, మేయర్ కావటి మనోహరనాయుడుతో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ.. నగరంలో 32 ప్రాంతాల్లో తాగునీటి నమునాలు సేకరించి బయోలాజికల్ పరీక్షకు పంపామన్నారు. అలాగే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెం.83413 96104కు ఎవరైనా అత్యవసర చికిత్స కోసం ఫోన్ చేసినప్పుడు వారికి వెనువెంటనే వైద్యచికిత్సను అందించేందుకు చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

నగరంలో పార్కుల అభివృద్ధికి కృషి

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజనీ

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 11 : నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పచ్చదనం పెంపునకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజనీ తెలిపారు. ఆదివారం నగరంలోని 22వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో రూ.37 లక్షల నగర పాలక సంస్థ అభివృద్ధి చేసిన పట్టంశెట్టి చిన్న రామయ్య పార్కును ఆమె ప్రారంభించారు. అనంతరం రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ నగరంలోని పార్కులను ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమ్మె ఒప్పంద జీవోలు విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: అంగన్‌వాడీల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలం జీతంతో సహా అన్ని జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పీ. దీప్తిమనోజ డిమాండ్ చేశారు. ఆదివారం పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ జిల్లావిస్తృత సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె ముగిసి మూడువారాలు అయినా నేటికీ ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన జీవోలు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సమ్మె కాలం జీతం జీవోనేటికీ ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. ఒప్పందంలో భాగంగా కొన్ని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న త్రైపాక్షికకమిటీని కూడా వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాలో హెల్పర్ల పోస్టులను నెలరోజుల్లోగా భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా నేతలు వీవీ.కుమారి, టీ.రాధ, సుకన్య, ప్రేమలత, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 11: విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీ-13సెక్షన్ పరిధిలోని మానససరోవరం పరిధిలోని షాప్ ఎంప్లాయిస్ కాలనీ, రాహుల్‌గాంధీనగర్, జియావుద్దీన్‌నగర్, పోలీస్ ప్లాట్స్, వెంకటేశ్వరకంపెనీ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

17న నిర్విరామ వీణా కచేరీలు

గుంటూరు, ఫిబ్రవరి 11: రామరాజు ఫౌండేషన్, వాగ్దేవి సంగీత నిలయం సంయుక్త ఆధ్వర్యంలో 9 మంది వీణా విద్వాంసులతో నిర్విరామ వీణా కచేరీలు ఈ నెల 17న బృందావన్‌గార్డెన్స్‌లోని వెంకటేశ్వర దేవస్థానంలో నిర్వహించనున్నట్లు రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ రామరాజు శ్రీనివాస్ తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లో ఆదివారం కార్యక్రమాల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీణాకచేరికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం, ప్రముఖ సంగీత, సాహితీవేత్త డాక్టర్ బూసరపల్లి వెంకటేశ్వర్లు, దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్యలు హాజరవుతారన్నారు. టాప్ గ్రేడ్ వీణా కళాకారుడు డీ.శ్రీనివాస్‌కు ఈమని శంకరశాస్త్రి స్మారక పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం వీజేకేకుమార్, పీ. ఫణికుమార్, సీహెచ్ రమణ తదితరులున్నారు.

14న జనరంజక కవి పురస్కారాల సభ

రావి రంగారావు సాహిత్య పీఠం ఏటేటా నిర్వహిస్తున్న జన రంజక కవి ప్రతిభా పురస్కారాల ప్రదాన సభ ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ కమిషనర్, ప్రముఖ సాహితీవేత్త మొండెపు ప్రసాద్, ప్రపంచ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్ హాజరవుతారన్నారు. సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగ రాజ్యలక్ష్మీ అధ్యక్షత వహిస్తారని, దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతివెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్‌బాబు

క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలి

●భాష్యం గుంటూరు అర్బన్‌జోన్ స్పోర్ట్స్‌మీట్‌లో డాక్టర్ రాకేష్‌బాబు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 11: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల జీవితాల్లో క్రీడలు భాగంగా ఉండాలని, అప్పుడే వారి శారీరక ఆరోగ్యం, మానసిక వికాశం పెంపొందుతుందని చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ దేవాభక్తుని రాకేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక గోరంట్ల భాష్యం రామసేతు క్యాంవస్ గ్రౌండ్‌లో భాష్యం గుంటూరు అర్బన్ జోన్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ రాకేష్‌బాబు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలని, సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉంచాలని, వారు ఏం చేస్తున్నారో ఒక కంట కనిపెట్టాలని సూచించారు. తొలుత డాక్టర్ రాకేష్ బాబు స్పోర్ట్స్ మీట్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలలైన వారికి ఛైర్మన్ రామకృష్ణ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో భాష్యం గుంటూరు అర్బన్ -1 జెడ్ ఈవో శివ, అర్బన్ -2 జెడ్ ఈవో స్వప్న, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్,ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: స్థానిక కొత్తపేట, శ్రీ హనుమాన్ ఆదర్శ సేవసమితి ఆధ్వర్యంలో దాదాపు వంద మంది వృద్ధులకు ఆదివారం బియ్యంతో పాటు, 11 రకాలు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వివరించారు. కార్యక్రమంలో సేవ సమితి పాలకవర్గ సభ్యులు మామిడి మురళీకృష్ణ, ఎస్ వీ. రమణ, పలకలూరి శివరావు, పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, పోలేపల్లి లహరి, పవన్‌కుమార్, పలకలూరి శివరావు, టి మురళీ సాయి, పూర్ణచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కవితగా 'దేశ జయకేతనం'

గుంటూరు, ఫిబ్రవరి 11: నవభారత నిర్మాణ సంఘం, గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్ట్ విజయవాడ వారి సంయుక్త నిర్వహణలో భారత కవికోకిల సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఆదివారం విజయవాడలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. నగరానికి చెందిన కవి, రచయిత సయ్యద్ జానీబాషా స్వీయరచన 'దేశ జయకేతనం' కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. ఈ సందర్భంగా జానీబాషాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా నగదు బహుమతి అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శ్రీరాం కవచం సాగర్, ప్రభాకర్ జైనీ, కలిమిశ్రీ, బా రహంతుల్లా తదితరులున్నారు.

వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: స్థానిక అరండల్‌పేట, వైన్ డీలర్స్ కళ్యాణమండపంలో వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్ ఆధ్వర్యంలో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల భాస్కరరావు, జాయింట్ కార్యదర్శి చంద్రగిరి గోవిందు, రాష్ట్ర సలహాదారులు, ప్రకాశంజిల్లా అధ్యక్షులు బండారు వెంకట్రావు, నెల్లూరుజిల్లా అధ్యక్షులుగా వల్లెపు బాబా కోటేశ్వర రావు, పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులుగా బూర్సు శ్రీనివాస్, నగర అధ్యక్షులుగా ఉప్పుతుల సత్యనారాయణ, నగర యూత్ అధ్యక్షుడిగా అచ్చి చైతన్యను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమీటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్ మాట్లాడుతూ ఈనెల 20న గుంటూరులో తలపెట్టే వడ్డెర యువగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వడ్డెర నేతలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో
దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడి



మందులు అందజేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 11: పురాతనమైన ఆయుర్వేదం వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులకు మంచి ఫలితాలు సాధించవచ్చని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఆయుర్వేద వైద్య నిపుణుడు కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ప్రసిద్ధి చెందిన కొట్టక్కల్ ఆర్య వైద్యశాల (కేరళ) అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్, గోదావరి ఆంధ్రా కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రెడ్డిపాలెంలోని బొడ్రాయి సెంటర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు కొట్టక్కల్ ఆర్య వైద్యశాల మందులతో పంచకర్మ వైద్యం చేయడం ద్వారా త్వరగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సుమారు 300 మంది రోగులకు ఉచితంగా నాడీ పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద పద్ధతిలో పరీక్షలు జరిపి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ధనలక్ష్మీ, డాక్టర్ సాయి గౌతమి, డాక్టర్ భాను కశ్యప్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ ఛరిష్మ, మేనేజర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



తెల్లవారుజామున 4 గంటలకు శారదా కాలనీ రిజర్వాయరు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

తాగునీటి సరఫరాపై ఆందోళన వద్దు

● పరిశుభ్రమైన నీరు అందించేందుకు పటిష్ఠ చర్యలు
● జీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
● క్షేత్రస్థాయిలో రిజర్వాయర్లను పరిశీలించిన కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్),ఫిబ్రవరి 11: నగరపాలకసంస్థ పరిధిలో తాగునీటి సరఫరాపై నగర ప్రజలు ఆందోళనకు గురికావద్దని, పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు నగరపాలక సంస్థ పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కీర్తిచేకూరి తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటల నుండి శ్రీనగర్, శారదాకాలనీ, వసంతరాయపురం, ఐపీడీకాలని, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి, మెడికల్ కాలేజిలోని రీజినల్ ల్యాబ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరా సమయంలో నివాసాల వద్ద నుంచి స్యాంపిల్స్‌సేకరించి క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం వేకువజామున తాగునీటి సరఫరా సమయంలో నీటిలో క్లోరిన్ శాంపిల్స్‌ని గుంటూరు వైద్యకళాశాల రీజినల్ ల్యాబోరేటరీ ల్యాబ్ టెక్నీషియన్, జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నివాసాల నుండే తాగునీటి స్యాంపిల్స్ సేకరించామని, అందులో క్లోరిన్‌శాతం తగిన మోతాదులోనే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నగరంలో తాగునీటి సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన స్పందించేందుకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో 0863-2345103 స్పెషల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటలు అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. ఎవరైనా అధికారులు నిర్లక్ష్యంగావుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి కాలుష్య అనుమానిత ప్రాంతాలైన శ్రీనగర్, శారదకాలని, సంగడిగుంట ప్రాంతాలకు ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టీ.వెంకట కృష్ణయ్య, డీ.వెంకట లక్ష్మీలను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యసేవలు..

శారదాకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కమిషనర్ సూచించారు. ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్‌వో (ఎఫ్ఏసి) మధుసూదన్, డీఈఈలు రమేష్ బాబు, హనీఫ్, రాము, శ్రీధర్, ఎస్.ఎస్.లు రాంబాబు, ఆయుబ్‌ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

హత్యకు గురైన మహిళ గుర్తింపు

గుంటూరు, ఫిబ్రవరి11: ఏటుకూరు శివారు లాల్‌పురం డొంక ప్రాంతంలో శనివారం హత్యకు గురైన మహిళను నల్లచెరువు 25వ లైన్‌కు చెందిన కాలువ నాగపూజ(36)గా గుర్తించారు. ఈనెల 9న సాయంత్రం ఆరు గంటల సమయంలో నాగపూజ మార్కెట్‌కు వెళుతున్నట్లుచెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. అయితే అనూహ్యంగా శనివారం ఆమె ఏటుకూరు శివారు ప్రాంతంలో శవమై కనిపించింది. మొదట గుర్తు తెలియని మహిళగా పోలీసులు వెల్లడించారు. మీడియలో వచ్చిన కథనంతో ఆమె కుటుంబ సభ్యులు గుర్తించి హత్యకు గురైంది నాగపూజ అని పోలీసులకు తెలిపారు. ఆమె కొంతకాలంగా నాగరాజు అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసులు నాగరాజును నిందితుడిగా అనుమానిస్తున్నారు. అయితే నాగరాజు పరారీలో ఉన్నాడు. అతని సెల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా నాగరాజు చెన్నైలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు గాలిస్తున్నారు. కాగా హతురాలికి భర్త కృష్ణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

జీజీహెచ్ నుంచి మహిళ అదృశ్యం



రూతమ్మ (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 11 : గుంటూరు నగరంలోని జీజీహెచ్‌నుంచి కఠారపు రూతమ్మ (33) అనే మహిళ అదృశ్యమైంది. అమరావతిమండలం మల్లాదికి చెందిన రూతమ్మ తరపు బంధువులకు ఆరోగ్యం బాగోనందున పలకరించడానికి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఈ నెల 11న తన మామ కటారపు స్వామి తో కలిసి వచ్చింది. తన మామ మోటార్ సైకిల్‌ను పార్కింగ్‌లో పెట్టివచ్చి చూడగా తన కోడలు రూతమ్మ కనిపించ లేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. రూతమ్మ అదృశ్యమైనప్పుడు నలుపు రంగు పువ్వుల చీర ధరించి ఉందని, ఛామనచాయ రంగు కలిగి, ఎత్తు 5.1 అడుగులు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో 08632221815కుగానీ, సీఐ అన్వర్ బాషాకు 8688831320లో తెలియ జేయాలని పోలీసులు కోరారు.




విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

సౌత్ జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ విజేత ఏపీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: ఆంధ్ర ప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ మాజేటి గురువయ్య డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గత రెండు రోజులుగా సాగుతున్న సౌత్ జోన్ రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీలలో ఆంధ్రప్రదేశ్(విన్నర్), తమిళనాడు(రన్నర్స్)గా నిలిచారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు కారక్రమానికి ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. బోస్ బాబు, ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.ప్రభాకర్‌లు హజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురువయ్య డిగ్రీ కళాశాల పాలక మండల అధ్యక్షుడు గుడివాడ రూపచంద్రారావు మామిడి సీతారామయ్యలు పాల్గొన్నారు.

వికాస్ హాస్పిటల్‌లో రాయితీతో వైద్యసేవలు

● హాస్పిటల్ డైరెక్టర్ గల్లా మాధవి వెల్లడి



మాట్లాడుతున్న హాస్పిటల్ డైరెక్టర్ గల్లా మాధవి

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 11: ఏఈఎల్‌సీ సంఘాలలో ఆదివారం ప్రత్యేకంగా జరిగిన కృతజ్ఞత అర్పణల పండగలో వికాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాల్లో ఏఈఎల్‌సీ సంఘాల్లోని అభిశక్తులకు, పాస్టర్లకు, సభ్యులకు వైద్యసేవలు అందించారు. వైద్యశిబిరానికి హాజరైన ప్రతి సభ్యుడికి రాయితీతో కూడిన సేవల కోసం హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వికాస్ హాస్పిటల్ డైరెక్టర్ గల్లా మాధవి మాట్లాడుతూ తమ హాస్పిటల్ ప్రారంభమైనప్పటి నుంచి రాయితీతో కూడిన వైద్యసేవలు అందిస్తున్నామని, ఆ సేవలను ఇకపై సంఘం సభ్యులకు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు అందుబాట్లోకి తెస్తామని మాధవి ప్రకటించారు. కార్యక్రమంలో వికాస్ హాస్పిటల్స్, శ్రీభ్రమరాంబ టౌన్‌షిప్ ప్రైవేటు లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు, డాక్టర్ సురేంద్ర నాగులపాటి, డాక్టర్ సుధాకర్ కనుమూరి, సీఈవో ప్రణీత్ బత్తుల పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఐరాసలో సంస్కరణలు అవరోధాలు-పరిష్కారాలు



త్రాసు ముల్లు ఎప్పుడూ సమతౌల్యతను సూచిస్తూ మధ్యస్థంగా ఉండి తీరాలి. అప్పుడే ఆ త్రాసు బేరీజు వేసేందుకు అనుకూలమైనదిగా పరిగణనలో ఉంటుంది. అలా కాకుండా ఎటువైపు ఒరిగినా తూనిక చేసే అర్హత కోల్పోతుంది. నిజానికి ఎంచి చూడాల్సిన ఏ క్రతువుకైనా ఉండాల్సిన ప్రాథమిక లక్షణం ఇది. స్థిరత్వం, శాంతి, సహకారం, ప్రాథమిక సూత్రాలుగా ప్రపంచానికి పెద్ద దిక్కుగా ఏర్పడిన ఐక్యరాజ్య సమితి, కొన్ని దేశాలవైపు మొగ్గిన నేపథ్యంలో దాని విశ్వసనీయతపై సర్వత్రా నిరసనలు వినిపిస్తున్నాయి. అదే సంస్కరణల అవసరాన్ని తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఐక్యరాజ్య సమితిలో అత్యంత ప్రధానమైనదిగా భావించే భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కోఫీ అన్నన్ సైతం 'భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడమో లేదా దాని ప్రాబల్యాన్ని కోల్పోయే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమో తేల్చుకోవాల్సిందే'అని హెచ్చరించారు. ఇటీవల భారత్ వేదికగా జరిగిన జీ-20 సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్‌లో సైతం 'ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు' అంశాన్ని చేర్చారు. ఇటీవల ఎలాన్ మస్క్ సైతం 'అత్యధిక జనాభాగల దేశమైన భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం అసంబద్ధం' అని, ఐక్యరాజ్య సమితి అంగాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని ట్వీట్ చేశారు. పరిమితికి మించిన అధికారాన్ని అనుభవిస్తున్న దేశాలు దానిని వదులుకోవడానికి సుముఖంగా లేకపోవడం వల్లే ఈ తంటా అని కూడా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మరోసారి తాజాగా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం అనే అంశం తెరపైకి వచ్చింది. దరిమిలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, దాని ప్రాముఖ్యం, విస్తరణ, ప్రజాస్వామ్యీకరణల అవసరం, అవరోధాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి

● ఐక్యరాజ్య సమితికి చెందిన ఆరు ముఖ్య అంగాల్లో భద్రతా మండలి ఒకటి. అంతర్జాతీయ శాంతి భద్రతల పరిరక్షణ దాని బాధ్యత. ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో కొత్త సభ్య దేశాల ప్రవేశానికి సిఫార్సు చేయడం, ఐక్యరాజ్య సమితి చార్టర్‌కు చేసే మార్పులకు ఆమోదం తెలపడం దీని అధికారాలు. అంతేకాకుండా అంతర్జాతీయ శాంతిని కాపాడేందుకు ప్రపంచంలో ఎక్కడికైనా భద్రతా దళాలను పంపడం, మిలటరీ చర్యలు చేపట్టడం, పరిస్థితులను అనుసరించి దేశాలపై వివిధ ఆంక్షలు(శాంక్షన్స్) విధించడమనే కీలకాధికారాలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి అంగాలన్నింటిలో ఒక్క భద్రతా మండలికి మాత్రమే- సభ్య దేశాలకు నిర్బంధంగా పాటించాల్సిన ఆజ్ఞలు జారీ చేసే అధికారం ఉంది. మిగతా అయిదు అంగాలకు కేవలం సభ్య దేశాలకు సిఫార్సులు చేసే అధికారమే ఉంది. భద్రతామండలికి మాత్రమేగల నిర్ణయాలు అమలు చేసే శక్తి దానిని, దానిలోని శాశ్వత సభ్యులను అత్యంత శక్తిమంతంగా మార్చింది.

భద్రతా మండలి కూర్పు

● భద్రతా మండలిలో వీటో అధికారం ఉన్న అయిదు శాశ్వత సభ్య దేశాలు, రెండేళ్ల కాలానికి ఎన్నుకొన్న వీటో అధికారం లేని మరో పది దేశాలు కలిపి మొత్తం 15 సభ్య దేశాలు ఉంటాయి. వీటిలో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు ఐక్యరాజ్య సమితి చార్టర్ 1946 ప్రకారం శాశ్వత సభ్య దేశాలుగా గుర్తింపు పొందాయి. తాత్కాలిక సభ్య దేశాలకు గల పది స్థానాలకుగాను ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ఏటా అయిదు దేశాల చొప్పున రెండేళ్ల కాలానికి ఎన్నుకుంటుంది. రిటైర్ అవుతున్న అయిదు తాత్కాలిక సభ్య దేశాలు వెంటనే ఎన్నిక అవడానికి వీలు లేదు. ఈ పది తాత్కాలిక సభ్య దేశ స్థానాలు ప్రాంతీయ ప్రాతిపదికన పంపిణీ అవుతాయి. ఆఫ్రికా, ఆసియా దేశాలకు 5; తూర్పు యురోపియన్ దేశాలకు 1; లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలకు 2; పశ్చిమ యురోపియన్ దేశాలకు 2 స్థానాలు ఉంటాయి.

● ఈ పది తాత్కాలిక స్థానాల్లో ఎటువంటి నామినేటెడ్ స్థానాలు ఉండవు. అన్ని స్థానాలకూ రహస్య బ్యాలెట్ పద్ధతిన సాధారణ సభలో ఎన్నికలు నిర్వహిస్తారు. 2/3వ వంతు మెజారిటీని సాధించిన దేశాలకు రెండేళ్ల పాటు భద్రతా మండలి తాత్కాలిక సభ్యత్వం లభిస్తుంది. భద్రతా మండలి సభ్య దేశాల మధ్య దాని అధ్యక్ష పదవి నెలనెలా బదిలీ అవుతూ ఉంటుంది.

● శాశ్వత సభ్య దేశాలైన పీ-5 దేశాల్లో ప్రతీ ఒక్క దేశానికి వీటో అధికారం ఉంటుంది. ఈ అధికారంతో వారు భద్రతా మండలిలో ఏ తీర్మానానికి అయినా వ్యతిరేకంగా ఓటు వేసి దానిని అడ్డుకోవచ్చు. ఒక కొత్త దేశాన్ని సభ్య దేశంగా చేర్చుకోవడం లేదా ఐరాస జనరల్ సెక్రటరీగా ఎవరి ఎన్నికనైనా అడ్డుకోవడానికి సైతం చేయవచ్చు. అయిదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటైయినా వ్యతిరేకంగా ఓటు వేసి భద్రతా మండలి ఏ తీర్మానాన్నైనా అడ్డుకోవచ్చు. భద్రతా మండలి ఏ నిర్ణయమైనా అయిదు శాశ్వత సభ్య దేశాల సర్వామోదంతోనే జరగాలి. ఏ ఒక్కరు వ్యతిరేకించినా వీటో అధికారం ఉపయోగించినా అది చెల్లదు.

● శాశ్వత సభ్య దేశాలకు ఉన్న ఈ వీటో అధికారాన్ని వినియోగించి అసంబద్ధ నిర్ణయాలను అడ్డుకోవడానికి బదులు ఇటీవల ఆ దేశాలు తమ స్వప్రయోజనాల కోసం రాజకీయ వ్యూహాల కోసం వినియోగిస్తున్నాయి. దీనితో ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి ఏర్పాటుకు గల మూల ఉద్దేశాలకు గండి పడుతోంది. అంతేకాక భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాల దురాగతాలకు వ్యతిరేకంగా భద్రతా మండలి చర్యలు తీసుకోవడానికి అవకాశం లేకుండా పోతోంది.

● అమెరికా ఒకప్పుడు ఇరాక్‌పై దండెత్తినపుడు, రష్యా ప్రస్తుతం ఉక్రెయినపై దాడి చేస్తున్న సందర్భంలోనూ భద్రతా మండలి క్రియాశూన్యంగా మిగిలిపోతోంది.

అంతేకాక శాశ్వత సభ్య దేశాల వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాటి మిత్ర దేశాలను వెనకేసుకు వచ్చే దుశ్చర్యలను నిలువరించలేని దుస్థితికి భద్రతా మండలి చేరుకుంది. ఉదాహరణకు ఇజ్రాయెల్‌కు అమెరికా కొమ్ముకాయడం; చైనా, పాకిస్థాన్‌ల ఉగ్రవాదాన్ని వెనకేసుకు రావడం వంటి ఉదంతాలను చెప్పుకోవచ్చు. అంతేకాక భద్రతా దళాల ప్రయోగం, ఉపసంహరణ, ఆంక్షల విధింపు వంటి చర్యలను ప్రపంచంలోని అశాంతిని నిర్మూలించేందుకు కాక పీ-5 దేశాలు తమ స్వప్రయోజనాలు, చమురు నిల్వలు కొల్లగొట్టేందుకు ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వీటో అధికారంలో సంస్కరణలకు, భద్రతా మండలిలో ప్రజాస్వామ్యీకరణకు, జనాభా ప్రాతినిధ్య సమతౌల్యతకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు పెరుగుతున్నాయి.

జీ-4 కూటమీ

● భారత్ సహా మరో మూడు దేశాలు(జపాన్, జర్మనీ, బ్రెజిల్) కలసి జీ-4 కూటమిగా ఏర్పడి పరస్పర మద్దతుతో భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి చేస్తున్నాయి. వీరు తమతో పాటు ఆఫ్రికా వంటి ఇతర ప్రాంతాలకు కూడా ప్రాతినిథ్యం దక్కాలని వాదిస్తున్నాయి.

● ఈ జీ-4 దేశాల ఆర్థిక, రాజకీయ, సైనిక బలం కొన్ని దశాబ్దాలుగా విస్తరించడం; పీ-5 దేశాలతో సరితూగగల స్థాయిని సాధించడం వంటి అంశాల నేపథ్యంలో జీ-4 దేశాలు తమ ప్రాతినిధ్యానికి మరింత పట్టుపడుతున్నాయి.

● శాశ్వత సభ్య దేశ స్థానాలను అయిదు నుంచి పదకొండుకు, తాత్కాలిక సభ్య దేశాల స్థానాలను పది నుంచి పద్నాలుగుకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

కాఫీ క్లబ్

జీ4 ప్రయత్నాలను నిర్వీర్యం చేయడానికి ఆయా దేశాలతో ఆర్థికపరమైన పోటీ, రాజకీయపర శతృత్వం గల దేశాలు 'కాఫీక్లబ్'గా ఏర్పడి జీ4 దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని అడుకొనే ధ్యేయంతో పనిచేస్తున్నాయి. ఈ కాఫీ క్లబ్‌లో పాకిస్థాన్, దక్షిణకొరియా, ఇటలీ, అర్జెంటీనా సభ్యులుగా ఉన్నాయి.

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ



అన్ని జీవులలో ప్రత్యుత్పత్తి అనేది ప్రధాన ధర్మాలలో ఒకటి. ప్రత్యుత్పత్తి విధానంలో జీవులు పాత జీవుల స్థానంలో వాటిని పోలిన లేదా కొద్ది తేడాలతో ఉన్న కొత్త జీవులను ఉత్పత్తి చేస్తాయి. ఒక ప్రజాతి కొనసాగడానికి, జన్యు పదార్థాన్ని పునఃఉత్తేజనం చేయడానికి ప్రత్యుత్పత్తి విధానం అత్యవసరం. వివిధ జంతువులలో వివిధ రకాల ప్రత్యుత్పత్తి జరుగుతుంది.

ప్రత్యుత్పత్తిలో హార్మోన్లు ముఖ్య పాత్రపోషిస్తాయి. ఉదాహరణకు పురుష, స్త్రీ బీజకోశాల హార్మోన్లు.. ప్రాథమిక, ద్వితీయ లైంగిక లక్షణాలు, బీజకోశాల పరిపక్వత, లైంగిక చక్రాల లయబద్ధత, పిండం విడుదల క్షీరోత్పత్తి మొదలైన వాటిలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

జీవులు రెండు రకాలుగా ప్రత్యుత్పత్తి చేసుకుంటాయి. అవి..అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి. అలైంగిక ప్రత్యుత్పత్తి జనక జీవిలో లేదా ఒకే జీవిలోనే జరుగుతుంది. ఈ విధానంలో ప్రత్యేకంగా పురుష, స్త్రీ బీజకోశాలు ఉండవు. విచ్ఛిత్తి, కోరకీభవనం, సిద్ధబీజాలు ఏర్పడటం, ముక్కలగుట, పునరుత్పత్తి, క్లోనింగ్, అనుషేకజననము అనే పద్ధతుల ద్వారా జరుగుతుంది. అలైంగిక విధానంలో ప్రతి జీవి ప్రౌఢజీవిగానే జన్యుపరంగా తమను పోలిన జీవులను తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. లైంగిక ప్రత్యుత్పత్తిలో స్త్రీ, పురుష జీవులు ఏకస్థితిక బీజకణాలను(అండాలు, శుక్ర కణాలు) ఉత్పత్తి చేసి, ఫలదీకరణం చెంది, ద్వయస్థితిక పిల్ల జీవిని తయారు చేస్తుంది.

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ప్రత్యుత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అనేక అవయవాలు శ్రోణి ప్రాంతంలో ఉంటాయి. అవి..ఒక జత ముష్కాలు, ఒక జత శుక్రవాహికలు, బాహ్య జననాంగాలు, అనుబంధ గ్రంథులు.

ముష్కాలు: ఒక జత అండాకార ముష్కాలు, ఉదర కుహరం బయట ముష్క గోణిలో వేలాడుతూ ఉంటాయి. ముష్కగోణులు వెనుక వేలాడుతూ ఉన్న సంచి వంటి నిర్మాణం. ఇది ముష్కాలకు రక్షణ ఇస్తూ, శుక్ర కణోత్పత్తికి కావలసిన ఉష్ణోగ్రత(శరీర ఉష్ణోగ్రత కంటే 2 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ తక్కువ) ఉండేటట్లు చేస్తుంది. పరిసరాల ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ముష్కగోణిలోని క్రెమాస్టర్ కండరం సంకోచం వల్ల ముష్కగోణి వెచ్చగా ఉన్న దేహానికి దగ్గరగా అవుతుంది. డార్టోస్ కండర సంకోచం వల్ల ముష్కగోణి ముకుళించుకుంటుంది. ఉష్ణోగ్రత సాధారణంగా ఉన్నప్పుడు పై రెండు కండరాలు విరామస్థితిలో ఉంటాయి. అందువల్ల ముష్కగోణి వెచ్చటి దేహానికి దూరంగా వేలాడుతూ ఉంటుంది. కొన్ని అసాధారణ సందర్భాల్లో ముష్కాలు శుక్ర కణాలను, టెస్టోస్టిరాన్ అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ ముష్కాలలో అధిక సంఖ్యలో మిలియన్ల కొద్దీ శుక్ర కణాలు ఉత్పత్తి అవుతాయి. సంపర్క సమయంలో 200-300 మిలియన్ల శుక్రకణాలను పురుషుడు స్ఖలిస్తాడు. ప్రతి ముష్కంలో చాలా లంబికలు ఉంటాయి. ప్రతి లంబికలో ఎక్కువ సంఖ్యలో మెలి తిరిగిన చిన్న చిన్న నాళికలు ఉంటాయి. వీటినే శుక్రోత్పాదక నాళికలు అంటారు. ఈ నాళికలు 80 సెం.మీ. పొడవును కలిగి శుక్రనాళికలోకి తెరచుకొని ఎపిడిడిమిస్‌ను ఏర్పరుస్తుంది. ఎపిడిడిమిస్ అనేది చుట్టలు చుట్టలుగా ఉం డే నాళం వంటి నిర్మాణం. ఇది శుక్ర కణాలను తాత్కాలికంగా నిల్వ చేస్తుంది, శుక్ర కణాలు పరిపక్వతకు రావడానికి కావలసిన సమయాన్ని కలుగజేస్తుంది.

శుక్ర వాహికలు: ఎపిడిడిమిస్ నుంచి శుక్రవాహిక బయలు దేరుతుంది. ఇది శుక్ర కణాలను ఎపిడిడిమిస్ నుంచి సంగ్రహిస్తుంది. శుక్ర వాహిక శుక్రాశయం నుంచి వచ్చే వాహికతో కలిసి స్ఖలన నాళాన్ని ఏర్పరుస్తుంది. శుక్రాశయం శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. రెండు వైపుల నుంచి వచ్చే స్ఖలన నాళాలు పౌరుష గ్రంథి మధ్య భాగంలో కలిసి ప్రసేకంలోకి తెరచుకుంటాయి.

బాహ్య జననాంగాలు: పురుషులలో ప్రసేకం అనేది మూత్ర జననేంద్రియ వాహికలు కలిసి ఏర్పడిన అంత్యనాళం. ప్రసేకము మూత్రాశయం నుంచి ప్రారంభమై మేహనం ద్వారా వ్యాపించి యూరెత్రమీటస్ అనే రంధ్రం ద్వారా బయటకు తెరచుకుంటుంది. మూత్రం, స్ఖలించిన శుక్రం రెండూ కూడా ప్రసేకం ద్వారా ప్రయాణించి బయటకు వస్తాయి. పురుషులలో మేహనం, ముష్కగోణులు అనే బాహ్యజననాంగాలు ఉంటాయి. మేహనం అనేది మూత్రనాళంగానే కాకుండా, స్త్రీ జీవి యోనిలో శుక్రద్రవాన్ని విడుదల చేసే ప్రవేశాంగముగా పనిచేస్తుంది. మేహనంలోని పృష్ఠభాగంలో కార్పొరా కావెర్నోసా, ఉదరభాగంలో కార్పస్ స్పాంజియోజమ్ అనే స్తంభాకార కణజాలల వలన మేహనం నిటారుగా, కడ్డీలాగా మారి శుక్రమును విడుదల చేయడంలో సహాయపడుతుంది. మేహనం చివర ఉబ్బి బల్బుగా ఉన్న భాగాన్ని గ్లాన్స్ మేహనం అంటారు. గ్లాన్స్ మేహనాన్ని ఆవరించి వదులుగా ఉన్న చర్మాన్ని ప్రెప్యూస్ అంటారు.

అనుబంధ గ్రంథులు: పురుష అనుబంధ గ్రంథులు వరుసగా..ఒక జత శుక్రాశయాలు, ఒక పౌరుషగ్రంథి, ఒక జత కౌపర్ గ్రంథులు

శుక్రాశయాలు: ఇవి ఒక జత మూత్రాశయం కింది భాగంలో ఉంటాయి. ఇందులో ఉండే శుక్ర కోశాలు శుక్రద్రవాన్ని స్రవిస్తుంది. శుక్ర ద్రవం చిక్కగా జిగటగా ఉంటుంది. 65 శాతం క్షారయుతంగా ఉంటుంది. శుక్రద్రవం క్షారం కావడం వలన యోనిలో ఉండే ఆమ్లత్వాన్ని తటస్థీకరిస్తుంది. శుక్రకణాలకు పోషక పదార్థాలను అందించడంలో, శుక్ర కణాల కదలికలకు శుక్ర ద్రవం ఉపయోగపడుతుంది. శుక్రద్రవంలో ఫ్రక్టోజ్, ప్రోటీన్లు, సిట్రిక్ ఆమ్లం, అకర్బన పదార్థాల పాస్ఫేట్, పొటాషియం, ప్రోస్టాగ్లాండిన్స్, విటమిన్-సి వంటి పదార్థాలు ఉంటాయి.

పౌరుష గ్రంథి: మూత్రాశయం కింద పౌరుష గ్రంథి ఉంటుంది. ఇది ప్రసేకము మొదటి భాగాన్ని ఆవరించి దాని స్రావాలను అనేక వాహికల ద్వారా ప్రసేకంలోకి పంపుతుంది. దీని స్రావం స్వల్ప ఆమ్ల స్థితిలో ఉంటుంది. శుక్ర కణాలను ఉత్తేజపరచడంలో, పోషణ అందించడంలో సహాయపడుతుంది.

కౌపర్ గ్రంథులు: వీటిని బల్బోయురెత్రల్ గ్రంథులుగా కూడా పేర్కొంటారు. ఇవి ఒక జత మేహనం మొదలయ్యే చోట, పౌరుష గ్రంథికి కింద, ప్రసేకానికి ఇరువైపులా ఉంటాయి. వీటి స్రావం తేటగా, జారేట్లుగా, క్షారయుతంగా ఉండి సంపర్కంలో రాపిడిని తగ్గించి శుక్రాన్ని ప్రసేకం ప్రసేకం ద్వారా సులభంగా జారేటట్లుగా చేస్తుంది. ఇవి బఠాణీ గింజ పరిమాణంలో ఉంటాయి.



కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

వైసీపీ అరాచకాలపై లోకేశ్ శంఖారావం

● టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను అణగదొక్కేందుకే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించారని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం ద్వారా పర్యటిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు 40రోజుల్లో 120 నియోజకవర్గాల్లో శంఖారావం జరుగుతుందని చెప్పారు. వైసీపీ నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా టీడీపీ గెలుపును ఆపలేరన్నారు. టీడీపీ - జనసేన శ్రేణులు శంఖారావంను విజయవంతం చేయాలని అబద్దయ్య కోరారు.

నేత కార్మికులను దగా చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ
● చేనేత మహిళలకు రాట్నాలు పంపిణీ

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పేరిట చేనేతలను దగా చేస్తుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. చేనేత కేంద్రమైన మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అమలు చేస్తున్న చేనేతకు చేయూత కార్యక్రమంలో భాగంగా ఆదివారం చేనేత మహిళలకు నూలు వడికే రాట్నాలను పంపిణీ చేశారు. 9వ విడతలో పట్టణంలోని 27వ వార్డుకు చెందిన 25 మంది మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో రాట్నాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం మంగళగిరి పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ సందాని, కోశాధికారిగా గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.ప్రసాద్, పీ.భాస్కర్, బి.చంద్రిక, సంయుక్త కార్యదర్శులుగా ఎస్‌డీ మస్తాన్‌వలి, ఘట్టమనేని సాయిరేవతి, కే.నాగశిరీష, కార్యవర్గ సభ్యులుగా జీ.మల్లేష్‌గౌడ్, ఎ.పవన్‌కుమార్, సందీప్, ఎస్కే సుభానీ, కే.మధుబాబులను ఎన్నుకున్నట్టు ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, సౌత్‌జోన్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా అసోసియేషన్ కార్యదర్శి దినేష్, గుంటూరు జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్ఎన్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

13న అగ్నిప్రమాద బాధిత రైతుల కమిటీ భేటీ

దుగ్గిరాల, ఫిబ్రవరి 11: కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతుల కమిటీ సమావేశం ఈనెల 13వతేదీ మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ వేముల వెంకట్రామయ్య, కో-కన్వీనర్ కాజా వెంకటేశ్వరావు ఆదివారం తెలిపారు. దుగ్గిరాలలో గతనెల 19న కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు పరిహారంపై ఎలాంటి పరిష్కారం లభించని విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాలతో ఏర్పడిన కమిటీ కార్యచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

అగ్ని బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: దుగ్గిరాల శీతల గిడ్డంగిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనరు యార్లగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులపై కపట ప్రేమ కురిపిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చోద్యం చూస్తుందని విమర్శించారు.

జూదరుల అరెస్టు

పెదనందిపాడు, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని గోగులమూడిలో జూదం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో జూదం ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,290ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బీసీలకు అండ తెలుగుదేశం పార్టీయే

● పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్ కుమార్

ఫిరంగిపురం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలను బలోపేతం చేయటం, నిధులు, విధులు, రిజర్వేషన్‌లు ఇచ్చి ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్‌టీఆర్ బడుగు బలహీన వర్గాలకు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి కార్పొరేషన్‌ల ద్వారా, సంక్షేమశాఖ ద్వారా వివిధ కుల వృత్తుల నైపుణ్యాల కోసం ఆదరణ పథకం తెచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక బీసీలపై అకృత్యాలు, అత్యాచారాలు, ఆస్తుల కబ్జాలు, హత్యలు లెక్కకు మిక్కిలిగా జరిగాయన్నారు. నవరత్నాల పేరుతో కార్పోరేషన్‌లను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ వైసీపీ రాష్ట్ర నాయకుడు వైవీ సుబ్బారెడ్డి కాళ్లకు మొక్కటం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమేనని ఆయన తెలిపారు. సదస్సులో రాష్ట్ర స్థాయి బీసీ నాయకులు, పాల్గొని మాట్లాడుతూ బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు, గౌరవం, ఉపాధి కల్పించిన ఘనత తెలుగు దేశం పార్టీదేనన్నారు. కార్యక్రమానికి ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి తెనాలి శ్రావణ్‌కుమార్, బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాత్మాపూలే, ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మద్దిరాల గంగాధర్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పసల థామస్, మేదర రాష్ట్ర కన్వీనర్ ధూళిపాళ్ళ ఏసుబాబు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నీలాల కృష్ణారావు, మల్లెల ఈశ్వర్, నాగేశ్వరరావు, తిరుమలకొండ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, కటికల రామకోటేశ్వరరావు, బైనబోయిన శివయ్య, వేల్పుల అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లి, ఫిబ్రవరి 11: తాడేపల్లి మండలం ఉండవల్లి పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉండవల్లి గ్రామ టీడీపీ నూతన కార్యాలయాన్ని ఆదివారం టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, చెప్పారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలంటే టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. అనంతరం చిరు వ్యాపారులకు నాలుగు టిఫిన్ బళ్లు, నాలుగు తోపుడు బళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు రాజారమేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, జంగాల సాంబశివరావు, గాదె శ్రీనివాసరావు, దొప్పలపూడి జ్యోతిబసు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పఠాన్ ఖాసింఖాన్, ఈపూరి కోటయ్య, పాలెపు వీరేంద్రనాథ్, చిగురుపాటి సుబ్బారావు, వీరిశెట్టి శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక, మంగళసూత్రం అందజేత

తాడేపల్లి, ఫిబ్రవరి 11: తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో మెరుగుమాల రుక్మాంగదరావు - జ్యోతి కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులు విజయలక్ష్మి-కమలాకర్‌లకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుక మంగళసూత్రం టీడీపీ నేతలు ఆదివారం అందజేశారు.

ఉండవల్లి కాపు జాగృతి కమిటీ ఎంపిక

తాడేపల్లి, ఫిబ్రవరి 11: కాపు జాగృతి, కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉండవల్లి కాపు జాగృతి కమిటి ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. స్థానిక కోలా సుబ్బారావు రోడ్డులోని దీక్షా మీడియా స్టూడియో నందు జరిగిన ఈ కార్యక్రమంలో కాపు జాగృతి రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్ధన్

ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదినం



మంగళగిరి, ఫిబ్రవరి 11: మంగళగిరి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆళ్ల కోటిరత్నమ్మ వందేళ్ల పూర్తి చేసుకుంది. స్థానిక ఎన్నికల సంఘం అధికారులు ఆమెను సీనియర్ ఓటరుగా గుర్తించి సత్కరించారు. కోటి రత్నమ్మ కుమారుడు ఆళ్ల రంగారెడ్డి మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు. శతాధిక వృద్ధురాలు కోటిరత్నమ్మ జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులు, రామచంద్రాపురం గ్రామస్థులు ఆదివారం నిర్వహించారు.

తాడేపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలో తాడేపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ కాంగ్రెస్ కార్యాలయాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కంతేటి జీవన్ సాగర్, మండల అధ్యక్షుడు కుప్పాల కృష్ణారావుచౌదరి, పట్టణ మహిళా అధ్యక్షురాలు రాధిక, షేక్ మున్ని, పఠాన్ సుభాని, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెంలో అసంపూర్తి రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎర్రబాలెంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆందోళన నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ ఎర్రబాలెం రామాలయం సెంటరు నుంచి అపోలో వరకు ఉన్న సీసీ రహదారి చెక్కు చెదరకపోయినా ప్రభుత్వ నిధులు రాబట్టుకునేందుకు నూతన రోడ్లను నిర్మించారని ఆరోపించారు. రామాలయం నుంచి గోశాల వరకు సుమారు రూ.1.05 కోట్లతో బీటీ రోడ్డు, గోశాల నుంచి సుమారు రూ.1.83 కోట్లతో సీసీ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారని తెలిపారు. అసంపూర్తి పనులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు సీఎం కావాలని కాలినడకన తిరుపతికి



కాలినడకన తిరుమల వెళ్లిన టీడీపీ శ్రేణులు

తాడికొండ, ఫిబ్రవరి 11: నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలని కోరుకుంటు తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన 13 మంది టీడీపీ శ్రేణులు కాలినడకన తిరుపతికి వెళ్లారు. 9 రోజుల పాటు సాగిన పాదయాత్ర ఆదివారం తిరుమలకు చేరుకున్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

మంగళగిరి, ఫిబ్రవరి 11: అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని మంగళగిరి మాజీ కౌన్సిలరు షేక్ మహ మ్మద్ రఫీ డిమాండ్ చేశారు. పట్టణంలోని 29వ వార్డులో ఆదివారం రాత్రి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. బాలలకు పండ్లు పంపిణీ చేసి, శరణాలయానికి రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు.

మంగళగిరి యువత భవిష్యత్తుకు లోకేశ్ భరోసా

● యువ యాప్ ద్వారా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ
● యాప్‌ను ఆవిష్కరించిన టీడీపీ నేతలు
● యువ చైతన్యం కోసం సైకిల్ యాత్ర ప్రారంభం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11: మంగళగిరి నియోజకవర్గంలోని యువత భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యాప్ ద్వారా యువతకు వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందించేందుకు సంకల్పించారు. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన యువ యాప్‌ను మంగళగిరి టీడీపీ నేతలు ఆదివారం ఆవిష్కరించారు. అలాగే, యువతలో చైతన్యం తీసుకురావడం కోసం తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వంలో యువతకు జరుగుతున్న అన్యాయాలను గురించి ప్రజలకు వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తమ్మిశెట్టి జానకీదేవి, మహమ్మద్ ఇబ్రహీం, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల రాజు, తోట పార్థసారథి, కేసనేని శ్రీఅనిత, మంచికలపూడి వైష్ణవి, పడవల మహేష్, షేక్ సుభానీ, బోగి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలి

● మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు

తుళ్ళూరు, ఫిబ్రవరి 11: జయహో టీడీపీ బీసీ సదస్సును జయప్రదం చేయాలని తుళ్లూరు మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు కోరారు. ఈ మేరకు ఆదివారం తుళ్లూరులోని పార్టీ మండల కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుమ్మా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 13న సాయంత్రం 4 గంటలకు తుళ్లూరులోని నవభారత్ కంపెనీ ఆవరణలో బీసీ సదస్సు జరుగుతుందన్నారు. పలువురు రాష్ట్ర బీసీ నాయకులు సదస్సుకు హాజరవుతారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయటమే బీసీల ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఆర్లల సదా శివరావు, బీసీ నాయకులు ఇందుర్తి నరసింహారావు, గుమ్మా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, జనసేన నాయకులు, క్యాకర్తలు పాల్గొన్నారు.

బలసాని ర్యాలీతో ప్రజలకు అగచాట్లు

● గుంటూరు - పర్చూరు రహదారిలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్
● ఆగ్రహావేశాలకు గురైన ప్రజలు, ప్రయాణికులు



ర్యాలీతో నిలిచిపోయిన వాహనాలు

పెదనందిపాడు, ఫిబ్రవరి 11 : ఏదో ఒక రకంగా తమ సత్తాను, ప్రజల్లో తమ పార్టీకి ఇంకా జోష్ ఉందని చాటిచెప్పుకునేందుకు వైసీపీ పడుతున్న అగచాట్లు ప్రజలకు తిప్పలుగా మారాయి. వైసీపీలో అంతర్గత కుమ్ములాట కారణంగా పార్టీ కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన కనిపించని పరిస్థితులు ఉండటంతో దీనిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో వైసీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఇటు ప్రజలతో పాటు అటు ప్రయాణికులకు చికాకు పుట్టిస్తున్నాయి. ఎక్కడో అన్నవరంలో వైసీపీ తలపెట్టిన గడప గడపకు ప్రచార కార్యక్రమానికి, పెదనందిపాడులో అన్నవరు ఎంపీటీసీ కల్లూరి నాగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్‌ను ర్యాలీగా అన్నవరు తోడ్కొని వెళ్లేందుకు వందల సంఖ్యలో వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే గుంటూరు-పర్చూరు రహదారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిపివేసి ద్విచక్రవాహనాలతో చక్కెర్లు కొట్టి, బాణసంచాలు పేల్చుతూ గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. దీంతో ప్రయాణికులు, ప్రజల నుంచి ఆగ్రహావేశాలను చవి చూడాల్సి వచ్చింది. ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నా అక్కడకు రాని పోలీసులు బలసాని కిరణ్‌కుమార్‌కు రాచమర్యాదలు మొదలుపెట్టారు.

● వైసీపీ నేతలు బాణసంచా పేల్చుతున్న సమయంలో నిప్పురవ్వలు ఎగిరి బాణసంచా నిల్వ ఉంచిన ఆటోలనే పడడంతో ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో మంటలు ఎగిసిపడ్డాయి. ప్రజలు భయభ్రాంతులకు గురై ఉరుకుల పరుగులు తీశారు. ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

● జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల

కొల్లిపర, ఫిబ్రవరి 11: యువతకు రాబోయే రోజుల్లో మన ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఆదివారం మండల పరిధిలోని తూములూరు సుగాలికాలనీ, హనుమాన్‌పాలెం, అన్నవరంలంక గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వ్యవస్థలో నిర్మాణం చేసుకోలేక, చేతకాక పోవటంతో యువత దూరప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తే యువతకు ఉద్యోగ అవకాశాలు లేక పోవడం దుర్మార్గం అన్నారు. జనసేన, చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీతో కలిసి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నట్లు తెలిపారు. తాను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు గుంటూరు నుంచి హనుమాన్‌పాలెం వరకు రోడ్డు వేయడం జరిగిందన్నారు. రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడు రోడ్డు పరిస్థితి చూస్తే మరింత దారుణంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్య నాయుడు, నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, పెరికల రాంబాబు, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, మొవ్వా వెంకయ్య, బందారు రవికాంత్, దివ్వెల మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పరస్పర దాడులు.. కేసు నమోదు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 11: పట్టణంలో పరస్పర దాడులు చేసుకున్న ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఆదివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరముల ప్రకారం చెంచుపేట జెండా చెట్టు బజారులో శనివారం రాత్రి అల్లం ఏసురత్నం తన ఇంటి తలుపు కోసిన విషయంపై చెప్పడి చంద్రశేఖర్‌ను అడగగా తనపై దాడి చేసి గాయపర్చాడని జిల్లా వైద్య శాలలో చేరి రిపోర్టు చేశాడని తెలిపారు. చెప్పడి చంద్రశేఖర్ తనపై ఏసురత్నం దాడిచేశాడని ఫిర్యాదు చేసాడన్నారు. ఇరువురి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 11: పట్టణంలో 10వ వార్డులో మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసిన్నట్లు అర్బన్ సీఐ పి.భాస్కర్ ఆదివారం తెలిపారు. 10వ వార్డుకు చెందిన మేచర్ల జ్యోతి మద్యం కలిగివున్నారనే సమాచారంతో సోదాలు నిర్వహించగా 7మద్యం బాటిళ్లు సాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవిద్య శివప్రసాద్‌బాబు తదితరులు

రజకపేటలో మెగా వైద్య శిబిరం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 11: స్థానిక రజకపేటలోని రజక ఐలమ్మ పార్క్‌లో ఆదివారం రజక ఐలమ్మ పార్కు వాకర్స్ అసోసియేషన్, అమ్మ హాస్పటల్స్ వారి సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్, డాక్టర్ జస్వంత్ బీపీ, షుగర్ రోగులకు, డాక్టర్ శివప్రసాద్‌బాబు పిల్లలకు, డాక్టర్ శ్రీవిద్య బాలికల, మహిళల అనారోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి తగు వైద్య సలహాలను, సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు మునిపల్లి ప్రసాద్, అధ్యక్షులు డాక్టర్ జె.శివప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షుడు పి.అర్జునరావు, సెక్రటరీ కె.శివనాగేశ్వరావు, అమ్మ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వధువుకు ఆలపాటి పెండ్లికానుకను అందిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆలపాటి పెండ్లికానుక అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 11: వివాహం సందర్భంగా వధువు కుటుంబసభ్యులకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెండ్లి కానుకను అందజేస్తున్నట్లు టీడీపీ శ్రేణులు చెప్పారు. ఆదివారం మండలంలోని మల్లెపాడు గ్రామానికి చెందిన కనపాల రాఘవులు, శశికళ దంపతుల కుమార్తె పద్మశ్రీ, అదేవిధంగా తెనాలి పట్టణంలోని 28వ వార్డులో మల్లెల సర్వేశ్వరరావు, ప్రేమగీత దంపతుల కుమార్తె జ్ఞానసుందరి వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన పెళ్లి కానుక ఉంగరం, నూతన వస్త్రాలను ఆ పార్టీ శ్రేణులు వారికి అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

16న జరిగే బంద్‌ను జయప్రదం చేయండి

● ములకా శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 11: డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణబంద్‌ను రైతులు, పాడిరైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఐతాగనర్‌లో శివసాంబిరెడ్డి పర్యటించి పాడి రైతులు, మహిళలతో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పశుపోషకులకు వాటిని మేపి పాల ఉత్పత్తితో లాభాలు గడించే రోజులు పోయాయన్నారు. అందుకు పశుగ్రాసం, తవుడు, దాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. వరిపైర్లు కోతల దశకు చేరుకునే సమయానికి కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు వరి కంకులను హార్వెస్టర్లతో కోతలు కోయిస్తున్నారని, ఫలితంగా ఎండుగడ్డి ముక్కలుగా మారి పశువులకు గ్రాసం లేకుండా పోతుందన్నారు. అడపాదడపా దొరికే ఎండుగడ్డి ఎకరాకు దాదాపుగా రూ.10వేలు వరకూ పలుకుతుందన్నారు. పాడి రైతులు పశువులకు షెడ్లు వేసుకునేందుకు బ్యాంకుల ద్వారా హామీలేని రుణాల కింద రూ.60వేలు వరకూ ఇచ్చే వెసులుబాటు ఉండగా బ్యాంకులు కూడా వాటిని ఇవ్వడంలేదని విమర్శించారు. పంటల సాగుకు రైతులు చేసిన రుణాలను మాఫీ చేయాలని కేరళ తరహాలో రుణ ఉపసంహరణ చట్టం తేవాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని కోరుతూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌లో రైతులు, పాడిరైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కె.శకుంతల, మేకల రజని, అత్తోట సరోజని, సుశీల, ఈపూరి బేబీ రాణి, కమలమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా దహనంపై పచ్చలతాడిపర్రులో నిరసన

● వైసీపీ నాయకులవి వికృత చేష్టలు: టీడీపీ



తాడిపర్రు గ్రామం వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 11: ప్రజాభిమానం కోల్పోయిన వైసీపీ ముష్కరులు గ్రామాలో వికృత చర్యలకు దిగుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు ఆరోపించారు. మండల పరిధిలోని పచ్చలతాడిర్రులో టీడీపీ జెండాను వైసీపీ శ్రేణులు దహనం చేయటంపై ఆదివారం టీడీపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. తాడిపర్రు గ్రామంలో శనివారం అర్ధరాత్రి టీడీపీ జెండాలు తగులబెట్టి ఆస్థానంలో వైసీపీ జెండాను కట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఆదివారం పచ్చల తాడిపర్రు గ్రామానికి చేరుకొని జీబీసీ రోడ్డుపై భైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూడలేని వైసీపీ ముష్కర మూకలు గ్రామాల్లో అలజడి సృష్టించటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ పతాకాలను దహనంచేసి వికృతానందాన్ని పొందుతున్నారన్నారు. ఇలాంటి పిరికి పంద చర్యలతో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతియ్యలేరని హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో టీడీపీని ఎదుర్కోలేక వైసీపీ గూండాలు ఇలాంటి చర్యలకు పూనుకోవటం హేయమైన చర్య అన్నారు. గతంలో కూడా తాడిపర్రులో టీడీపీ జెండా దిమ్మెను కూల్చివేసి అరాచకం సృష్టించారని అన్నారు. అప్పుడే పోలీసులకు ఫిర్యాదుచేస్తే నేటి వరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆనాడే చర్యలు తీసుకొనివుంటే ఇలాంటి చర్యలు పునరావృతం అయ్యేది కాదన్నారు. పోలీసులు కూడా చోద్యం చూడటం మాని గ్రామాల్లో అలజడులు సృష్టించటానికి ప్రయత్నిస్తున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. టీడీపీ నేతల ధర్నా సమాచారం తెలుసుకున్న అర్బన్, రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను అరెస్టు చేస్తామని నచ్చచెప్పటంతో టీడీపీ శ్రేణులు ధర్నాను విరమించారు. అలాగే రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు అందచేశారు. ధర్నాలో పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, నిడుబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, ఎద్దు సోంబాబు, యలవర్తి శేషగిరిరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, మల్లంపాటి వాసు, మధు, చిలకా రవి, షేక్ బాజీ సాహెబ్, నిమ్మగడ్డ ధర్మారావు, హుస్సేన్, మున్నంగి సుబ్బారెడ్డి, గరిగంటి సాయిబాబు, చిలకా విజయ్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలతో ఊరేగింపు చేసి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరించిన రథంపై ఉంచి ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. శ్రీవాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో 102 మంది ఆర్యవైశ్య కన్యలు, సుహాసినిలతో విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. మారీసుపేట శివాలయం కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సమితి అధ్యక్షుడు వరదా శేషగిరిరావు, కార్యదర్శి సుబ్బారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీగా దాట్ల మోహనరెడ్డి, ఎలిజబెత్‌రాణి నియామకం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 11: జిల్లా 11వ అదనపు ఏపీపీగా దాట్ల మోహనరెడ్డి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీగా జె.ఎలిజబెత్ రాణి నియమితులయ్యారు. గతంలో 2020-23లో ఏపీపీలుగా పని చేసిన వీరు 2024-26 వరకు ఆ పదవుల్లో కొనసాగుతున్నారు. పునః నియామకం చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు వారు తెలిపారు.



దాట్ల మోహనరెడి, ఎలిజబెత్ రాణి

దయానందుని బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

● ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: మహర్షి దయానందుని బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రూరల్ మండలం నందివెలుగులో ఆర్యసమాజ స్థాపకులు దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దయానంద వృద్ధాశ్రమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వైదిక ఉపన్యాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఉన్నంతలో సాటి వారికి సాయం చేయాలన్నారు. ఆర్యసమాజ రాష్ట్ర అధ్యక్షుడు కొసరాజు రవీంద్ర, కార్యదర్శి రవీంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నిర్మల, రవికుమార్, సువర్ణ వాణి, సత్యప్రకాష్, సుధీర్, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు ఆరే శేఖర్ మృతి

కొల్లిపర, ఫిబ్రవరి 11 : మండల కేంద్రం కొల్లిపరలో దళిత, టీడీపీ సీనియర్ నాయకుడు ఆరే శేఖర్ (55) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌లు స్థానిక నాయకులతో కలిసి శేఖర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీనియర్ సిటిజన్స్‌కు పోషకాహారం అవసరం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: సీనియర్ సిటిజన్స్ అన్నిరకాల విటమిన్లు, మినరల్స్ ప్రోటీన్లు ఉండే పోషకాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఆహార నిపుణులు నయబ్ రసూల్ చెప్పారు. కవిరాజా పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ సమావేశాన్ని గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన నిర్వహించారు. క్లబ్ సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మానసిక ఆందోళన లేకుండా కాలం గడపాలని, ప్రతిరోజూ తగినంత వ్యాయామం చేయాలన్నారు. శరీరానికి తగినంత నీరు అందిస్తూ ఆలోచనలు లేకుండా జీవనం గడపాలని చెప్పారు. క్లబ్ నిర్వహణకు సభ్యుడు రాపర్ల వెంకటనరసయ్య రూ25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో బొబ్బా వెంకటేశ్వరరావు, రంగరావు, రవిబాబు, రత్తయ్య అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



క్లబ్‌కు రూ.25 వేలు విరాళం అందిస్తున్న వెంకట నరసయ్య

ఆర్యవైశ్య సేవలు అభినందనీయం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: ఆర్యవైశ్య సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ కోవెలమూడి కళ్యాణి చెప్పారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, భాస్కరుని ప్రసాద్, గుప్తా, శ్యామలరావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న కళ్యాణి

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 11: పట్టణంలో పేదప్రజల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని పలువురు కొనియాడారు. స్థానికక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో ఆదివారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజిచౌక్‌లో అన్నక్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, మాదల కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



కీర్తనలు ఆలపిస్తున్న బాలికలు

త్యాగరాయ కీర్తనలు ఆలపించిన బాలికలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: నాజరుపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బాలికలు త్యాగరాయ కీర్తనలు ఆలపించారు. త్యాగరాజు స్వామి ఆరాధన మహోత్సవంలో భాగంగా ఆదివారం లక్ష్మీశారదా సంగీతాలయం గాయకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. రామలింగేశ్వరపేట సంగీత గురువు ఆంజనేయ శాస్త్రి ఇంటి నుండి ఆలయం వరకు నగర సంకీర్తన గావించారు. నాటరాగం, గౌళరాగం, ఆరబీ, వారళి, శ్రీరాగంలో 50 మంది బాలికలు ఆలపించిన కీర్తనలు శ్రోతలను అలరించాయి. కెవి రామకృష్ణ, శ్యాం, కుమార్, అభిరామ్, కొండపి శ్రీనివాసరావు, కేవశరావు, బాలచంద్ర మౌళి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 11: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైనట్లు తెనాలి ఫైర్‌స్టేషన్ అధికారులు తెలిపారు. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన షేక్ మక్బూల్, షేక్ ఇబ్రహింలు రెండు నిట్టాడుల పూరింట్లో నివాసముంటున్నారు. ఆదివారం ఆ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. ఫైర్ స్టేషన్‌కు అందిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో దాదాపుగా రూ.8లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్‌స్టేషన్ అధికారులు వెల్లడించారు. హెడ్‌కానిస్టేబుల్స్ సాయిబాబు, బి.రాజేష్‌గౌడ్, బి.రాజశేఖర్, ఫైర్‌ఇంజన్ డ్రైవర్ వి. చంద్రమోహన్, తదితదరులు మంటలు అదుపుచేసిన వారిలో ఉన్నారు.

పసుపు రైతుల ఆవేదన అర్థం చేసుకోవాలి

● రాష్ట్ర పసుపు రైతు సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు నిల్వ చేసి నష్టపోయిన రైతుల ఆవేదన అర్థం చేసుకోవాలని రాష్ట్ర పసుపు రైతు సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం తెనాలిలో విలేకర్లతో మాట్లాడుతూ, కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం కారణంగా మొత్తం కాలి బూడిద అయ్యిందని దీంతో ఎన్నో రైతు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. రైతుల వివరాలన్ని కూడా తెనాలి సబ్ కలెక్టర్‌కు అందించారని చెప్పారు. కానీ ఇంత వరకు వారికి ఎలాంటి న్యాయం జరగలేదని, వెంటనే నష్టపరిహారం చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను రైతులు విజయవంతం చేయాలన్నారు. సత్యనారాయణ, నాగేశ్వరరెడ్డి, రవికిషోర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైశ్య విద్యానిధి కమిటీ సర్వసభ్య సమావేశం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: శ్రీ కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో కోశాధికారి పెండేల సుబ్బారావు నాలుగేళ్ల పాటు నిర్వహించిన జమ ఖర్చుల వివరాలను సభ్యులకు వివరించారు. అధ్యక్షుడు పెండేల వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆడిట్ చేసిన నివేదికను ఆమోదించారు. మూడేళ్ల కాలానికి గాను నూతన పాలకవర్గాన్ని ఎన్నుకునేందుకు ప్రస్తుత అధ్యక్షునికి అధికారం కల్పిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు బచ్చు సాంబశివరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సత్యనారాయణమూర్తి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 11: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. మండలంలోని జగ్గడిగుంటపాలెంలో అదే గ్రామానికి చెందిన నక్కా భాగ్యలక్ష్మి అనే మహిళ బెల్ట్ షాపు ద్వారా మద్యం విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసకుని ఆమె నుంచి 8 క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి11: బృందావనగార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కేఆర్కే ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్‌కాసరనేని సదాశివరావు కళాసమితి 12వ నాటకోత్సవాలలో భాగంగా ఆదివారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ సభ్యులు యర్రా ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా డాక్టర్ జె.సీతారామారావు, ఎస్ ఆర్కే ప్రసాదు, డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, ఆలయ కమిటి అధ్యక్షులు మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, సంస్థ నిర్వాహకులు కె.రామకృష్ణప్రసాదు, ఆర్.వెంకట్రావు పాల్గొని 30మంది విద్యార్థులకు రూ.2లక్షల ఉపకార వేత నాలు అందజేశారు.



మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ రామారావు తదితరులు

450 మందికి వైద్య పరీక్షలు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 1: డీవీసీ హాస్పటల్ గ్రామీణ ప్రాంతంలో సేవే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురులో ఆదివారం డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ములుకుదురు పరిసర గ్రామాలకు చెందిన 450మంది శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సీఈవో డాక్టర్ కరణం నవీన్, డాక్టర్ లతిత్, డాక్టర్ ఆషీష్, డాక్టర్ లెనిన్, డాక్టర్ మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందచేస్తున్న టీడీపీ నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు టీడీపీ సాయం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 11: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిల్చింది. మండల పరిధిలోని మన్నవ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో చెల్లా సిలువ రాజు, బండ్లమూడి నల్లారావుకు చెందిన గృహాలు కాలి బూడిదయ్యాయి. బాధితులు సర్వం కోల్పోయారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు శిలువ రాజుకు రూ.10వేలు, నల్లారావుకు రూ.15వేలు ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ పోకడలకు చిరునామా వైసీపీ ప్రభుత్వం

● నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జక్కా రవీంద్రనాథ్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 11: నియంతృత్వ పోకడలకు వైసీపీ ప్రభుత్వం చిరునామాగా మారిందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జక్కా రవీంద్రనాథ్ ఆరోపించారు. శనివారం అర్ధరాత్రి పట్టణ, మండలంలో పలువురు కాంగ్రెస్ నాయకులకు పోలీసులు ముందస్తు అరెస్టు నోటీసులు జారీచేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ మోసపూరిత వైఖరిపై ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ నాయకులకు ముందస్తు నోటీసులతో గృహ నిర్బంధం చేశారు. జక్కా రవీంద్రనాథ్ మాట్లాడుతూ వైఎస్ షర్మిల పిలుపు మేరకు ప్రభుత్వ వైఫల్యాలను ఎండకడుతున్న కాంగ్రెస్ నాయకులను ప్రభుత్వం అణచివేయాలని చూస్తుందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై కేసులు బనాయించి అడ్డుకోవటం అప్రజాస్వామికం అన్నారు. ఐదేళ్ల మభ్యపెట్టి ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో వైసీపీ పాలకులు కొత్తనాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనామా నరేంద్ర

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 11: కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహనపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనామా నరేంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సర్పణ దివస్ నిర్వహించారు. పట్టణ, మండల అధ్యక్షుడు గోవాడ కృష్ణారావు, వడ్రాణం ఉదయ్ ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ పతాకాలను ఎగురవేసారు. వీవర్స్ కాలనీలో ఆరే వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకొని దీన్‌దయాళ్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, సీహెచ్ విజయ్‌భాస్కరరెడ్డి, తిరుపతిరావు, కలపాల శ్రీనివాసరావు, దానబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

క్రీడలతోనే శారీరక మానసిక ప్రశాంతత సాధ్యం

● క్రాఫ్ కో- ఆర్డినేటర్ వెంకట్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 11: పిల్లలు మైదానంలో క్రీడలాడటం ద్వారా వారిలో మానసిక ప్రశాంతత, శారీరక ధృడత్వం సాధ్యమవుతుందని క్రాఫ్ కో ఆర్డినేటర్ జి.వెంకట్ చెప్పారు. ఆదివారం మండలంలోని హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాలమేళా ఆటల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీల్లో గెలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, అంగన్ వాడీ వర్కర్ రుద్రపాటి అనూష, రుద్రపాటి రాజనాధ్, అజయ్‌కుమార్, సుధాకర్, ఏసోబు, జోజిబాబు, డ్వాక్రా సభ్యులు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



దివంగత ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పీవీ కృషి

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 11: దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కృషి ఎంతో ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రకటించడంతో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్వరాజ్ టాకీసు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టి దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చివేశారని చెప్పారు. ఆయనకు భారతరత్న ఇవ్వడం తెలుగు వారికి గర్వకారణమన్నారు. పురుషోత్తమశర్మ, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు.